- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

ఆదివారం
28-06-2026

సంపుటి : 01 సంచిక :97 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 97 NAMASTEY MAHAAPRABHA

## ఇంకెన్ని పరీక్షలు లీక్ చేస్తారు?



- మహారాష్ట్రలో టెట్ పేపర్ లీక్‌పై విపక్షాల విరుచుకుపాటు
- బీజేపీ ప్రభుత్వంపై విమర్శల వెల్లువ
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం: రాహుల్
- లీకులపై సమగ్ర విచారణకు డిమాండ్

న్యూఢిల్లీ: :- 27 జూన్ (మహాప్రభ
దేశంలో లీక్ చేయడానికి ఇంకా ఏవైనా పరీక్షలు మిగిలున్నాయా అంటూ బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దేశంలో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే నీట్ పేపర్ లీకేజీ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, ఇప్పుడు -మిగతా 3 లో

## హార్ముజ్ లో మళ్లీ ఉద్రిక్తతలు



- ఇరాన్ క్షిపణి, డ్రోన్ స్థావరాలపై అమెరికా ప్రతీకార దాడులు
- బహ్రెయిన్ సహా గల్ఫ్ లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ ఎటాక్

టెహ్రాన్ :- 27 జూన్ (మహాప్రభ
ఒకవైపు అమెరికా, ఇరాన్ మధ్య దౌత్యపరమైన చర్చలు జరుగుతుండగానే, మరోవైపు ఇరు దేశాలు పరస్పరం దాడులకు దిగాయి. దీంతో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ వాతావరణం నెలకొంది. హార్ముజ్ లో మళ్లీ పరిస్థితులు ఉద్రిక్తతంగా మారాయి. ఇరాన్ దళాలు వాణిజ్య నౌకపై డ్రోన్ దాడికి పాల్పడటంతో, దానికి ప్రతిచర్యగా -మిగతా 3 లో



## నేడు నల్లగొండకు సీఎం

- రూ.13వేల కోట్ల భారీ బడ్జెట్ ప్రాజెక్టులకు శ్రీకారం
- జిల్లా అధికారులు, పార్టీ శ్రేణులతో ఏర్పాట్లు పర్యవేక్షించిన మంత్రి కోమటిరెడ్డి
- పర్యటనలో సీఎం ఇచ్చే హామీలపై కోటి ఆశలు!

హైదరాబాద్ :- 27 జూన్ (మహాప్రభ
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుదీర్ఘ కాలం తర్వాత నల్లగొండ జిల్లాకు ఆదివారం పర్యటించనుండటంతో రాజకీయాల్లో ఉత్కంఠగా సీన్ మారింది. రూ. 13 వేల కోట్ల భారీ బడ్జెట్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనుండగా అధికార కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్ నెలకొంది. సీఎం పర్యటన సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా అధికారులు, పార్టీ శ్రేణులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే జిల్లాలో తీవ్ర నిరుద్యోగ సమస్యపై సీఎం ఎలాంటి స్పష్టత ఇస్తారనే ఉత్కంఠ నెలకొంది. నల్లగొండ, చౌటుప్పల్, మిర్యాలగూడ, నార్కట్‌పల్లి ప్రాంతాల్లో వందలాది ఫార్మా కెమికల్, సిమెంట్, రైస్ మిల్లుల పరిశ్రమలు ఉన్నాయి.

-మిగతా 3 లో


# వీబీ గ్రామ్ జీని అంగీకరించం

### రాష్ట్రాల అధికారాలను లాక్కునేందుకు కేంద్రం కుట్ర

- కర్నాటక, కేరళం రాష్ట్రంతో కలిసి ఉమ్మడి పోరాటానికి సిద్ధం
- జులై 2న రాష్ట్ర క్యాబినెట్‌లో తుది నిర్ణయం
- మంత్రివర్గ ఉపసంఘం చైర్మెన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హైదరాబాద్ :- 27 జూన్ (మహాప్రభ
వీబీ గ్రామ్ జీ చట్టం--2025ను తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ యథాతథంగా అంగీ కరించబోదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం రెండో సమావేశం నిర్వహించారు. మంత్రులు దనసరి అనసూయ సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, గడ్డం వివేక్ వెంకటస్వామి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవనోపాధికి వెన్నెముకగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ రాష్ట్రాల -మిగతా 3 లో






## ఆఫ్ఘనిస్థాన్‌లో 6.2 తీవ్రతతో భూకంపం..

- భారత్ సహా పలు దేశాల్లో ప్రకంపనలు
- భయాందోళనలో స్థానికులు: బయటకు పరుగులు
- 215 కి.మీ లోతులో భూకంప కేంద్రం
- అప్రమత్తమైన యంత్రాంగం: నివేదికల సేకరణ

న్యూఢిల్లీ: :- 27 జూన్ (మహాప్రభ
ఆఫ్ఘనిస్థాన్‌లోని హిందూ కుష్ ప్రాంతంలో 6.2 తీవ్రతతో భూకంపం సంభవించింది. భారత కాలమానం ప్రకారం శనివారం రాత్రి 7:04 గంటలకు ఈశాన్య ఆఫ్ఘనిస్థాన్‌లో భూమి లోపల 215 కిలోమీటర్ల లోతులో ఈ భూకంపం కేంద్రీకృతమైంది. కలాఫ్‌గాన్‌కు సుమారు 81 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆఫ్ఘనిస్థాన్‌తోపాటు పాకిస్థాన్, భారత్, చైనా, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, కిర్గిజ్‌స్థాన్, తుర్క్‌మెనిస్థాన్‌లో భూ ప్రకంపకనలు నమోదయ్యాయి.కాగా, ఆఫ్ఘనిస్థాన్‌లో -మిగతా 3 లో



## జూలై 2 వరకు విస్తారంగా వానలు

- పుంజుకుంటున్న నైరుతి రుతుపవనాలు
- చురకుగా కదులుతున్నాయన్న వాతావరణ శాఖల
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్
- 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు
- హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన

3 లో

## అప్పుల ఊబిలో పాక్!..

రూ 81.9 ట్రిలియన్లకు చేరిన రుణం




3 లో

## మునుపటిలా అదనపు సుంకాలు విధిస్తాం..

- భారత్‌కు అమెరికా హెచ్చరిక



3 లో

## నేడు పల్స్ పోలియో

- రాష్ట్రవ్యాప్తంగా 22,979 బూత్‌లు
- సుమారు 40.97 లక్షల మంది
- చిన్నారులకు పోలియో చుక్కలు



3 లో

# హైడ్రాతో కాంగ్రెస్ దుర్మార్గాలు



### రాష్ట్రంలో వికాసం పోయి విధ్వంసమే మిగిలింది

- ఫ్యూచర్‌సిటీ పేరిట రేవంత్ బంధువుల భూ దందా
- ఎస్సీ, ఎస్టీ, అసైన్డ్ భూములు దోచుకుంటున్నరు
- ఫార్మాసిటీ భూములను ఫ్యూచర్‌సిటీకి వాడుతుండ్రు
- పెట్టుబడులు పెట్టాలనుకునేవారు ఆలోచించుకోవాలి
- మహేశ్వరంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- విరుద్ధంగా భూములు కేటాయిస్తే చట్టం ఊరుకోదు
- ఎన్నికలెప్పుడొచ్చినా కాంగ్రెస్ బంగాళాఖాతంలోకే
- సర్, సభ్యత్వంపై మహేశ్వరంలో శ్రేణులకు దిశానిర్దేశం

3 లో

అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దుచేసి ఆ భూములను తిరిగి రైతులకే ఇస్తామని ప్రగల్భాలు పలికిన భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, కోదండరాం, మల్‌రెడ్డి రంగారెడ్డి, కోదండరెడ్డి వంటివారు ఆ భూములను రైతులకు ఎందుకు తిరిగి ఇవ్వలేక పోయిండ్రు? ఫ్యూచర్‌సిటీ పేరు చెప్పుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులు, ఆ ప్రాంత కాంగ్రెస్ నాయకులు రియల్ ఎస్టేట్ దందా కొనసాగిస్తున్నరు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ భూములు, అసైన్డ్, ప్రభుత్వ భూములను టార్గెట్ చేసి లాక్కుంటున్నరు.



## గోదావరి వరదలపై అప్రమత్తం కండి

- గతానుభవాలతో ముందస్తు నష్టనివారణ చర్యలు
- పుష్కరాల సందర్భంగా గోదావరి తీరం పరిశుభ్రంగా ఉండాలి
- అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల ఆదేశాలు

భద్రాద్రి :- 27 జూన్ (మహాప్రభ
గోదావరి వరదల వల్ల ప్రజానష్టం, పంట నష్టం లేకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతం భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో వరదల పట్ల జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామని తెలిపారు. కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయలో గోదావరి వరదల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికపై శనివారం జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వరదల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు

-మిగతా 3 లో



## సంజీవని గేమ్‌ఛేంజర్ పథకం

- ఆగస్ట్ 15 నుంచి అన్ని జిల్లాల్లో అమలు
- మార్కాపురంను జిల్లా చేసి మాట నిలబెట్టాం
- రైతులు సేంద్రియ వ్యవసాయం దిశగా సాగాలి
- సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు

మార్కాపురం, :- 27 జూన్ (మహాప్రభ
ప్రజల అండ ఉంటే కొండనైనా ఢీ కొట్టే శక్తి తనకు వస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. మార్కాపురంను ప్రత్యేక జిల్లాగా చేసి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామన్నారు. కిష్టంశెట్టిపల్లిలో పర్యటించిన ఆయన.. సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రజలు ఆనందంగా ఉండేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసం సంజీవని లాంటి వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. సంజీవని పథకం ఒక గేమ్ ఛేంజర్ అని అన్నారు. ఆగస్టు 15 నుంచి అన్ని జిల్లాల్లో సంజీవని పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. యోగా, ధ్యానం వంటి మంచి అలవాట్లతో మీ ఆరోగ్యం.. మీ చేతుల్లోనే ఉంటుంది. పిల్లలకు పౌష్టికాహారం పెట్టాలి.. తాజా ఆహారం తీసుకోవాలి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. వీలైనంత వరకు ఎరువులు తక్కువగా వాడాలి. యూరియా ఎక్కువ వేస్తే పంటను -మిగతా 3 లో

# సరిహద్దులోని నియంత్రణ రేఖ సమీపంలో పేలుడు..

-ఒకరు మృతి, నలుగురికి గాయాలు



**న్యూఢిల్లీ:- 27 జూన్ (మహాప్రభ**
దేశ సరిహద్దులోని నియంత్రణ రేఖ సమీపంలో పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో ఒక వ్యక్తి మరణించాడు. మరో నలుగురు గాయపడ్డారు. ఈ పేలుడుకు కారణం ఏమిటన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు. జమ్ముకశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం గుల్‌మార్గ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్వోసీ) సమీపంలో 'ఆశా పోస్ట్' వద్ద పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో ఒక వ్యక్తి మరణించాడు. మరో నలుగురు గాయపడ్డారు.కాగా, మృతుడిని బారాముల్లా జిల్లాలోని చందూసా ప్రాంతానికి చెందిన జాబిర్ అహ్మద్ బజాద్‌గా గుర్తించారు. గాయపడిన నలుగురిని వైద్య చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. పేలుడుకు కారణాలు ఏమిటన్నది తెలుసుకునేందుకు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు పాత బాంబు షెల్‌ను తాకడం లేదా కదిలించడం వల్ల ఈ పేలుడు సంభవించినట్లు అనుమానిస్తున్నారు. ఆ పేలుడు పదార్ధారం ఏమిటన్నది దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉన్నది.

# 194 ఏళ్ల తాబేలును కలుసుకోనున్న ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:- 27 జూన్ (మహాప్రభ**
హిందూ మహాసముద్ర ద్వీపం సీషెల్స్‌లో వచ్చే వారం ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆ పర్యటన వేళ ఆయన అక్కడ నేషనల్ బోటానికల్ గార్డెన్స్ వెళ్లనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన అక్కడ ఓ వృక్షాన్ని నాటనున్నారు. భారత్, సీషెల్స్ మధ్య 50 ఏళ్ల దౌత్య బంధానికి ప్రతీకగా ప్రధాని మోదీ ఈ పర్యటన చేపట్టనున్నారు. సీషెల్స్ జాతీయ దినోత్సవ సంబరాల్లో మోదీ గౌరవ అతిథిగా పాల్గొంటారు. ఇక ప్రపంచంలో ప్రాణాలతో ఉన్న అతి వృద్ధ జంతువును కూడా ప్రధాని మోదీ కలుసుకోనున్నారు1832లో పుట్టిన తాబేలును ఆయన వీక్షించనున్నారు. ఆ తాబేలు పేరు జోనాథన్. ఇప్పుడు అది సుమారు 194 ఏళ్లు ఉంటుందని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అంచనా వేసింది. సుమారు రెండు శతాబ్దాలకు చేరుకున్న ఆ జంతువు ఎన్నో చరిత్రాత్మక సందర్భాలకు సాక్షిగా నిలిచింది. వయసు మీరినా ఆ తాబేలు మాత్రం ఆరోగ్యకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. వెటరర్నీ డాక్టర్లు దాని ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నారు. అయితే వయసు రీత్యా ఆ తాబేలుకు కంటి చూపు మందగించింది. వాసన గుర్తుపట్టే గుణాన్ని కూడా కొంత కోల్పోయినట్లు తెలుస్తోంది.

# చైన్నైలో దారుణం..

-17 ఏండ్ల విద్యార్థినిపై సామూహిక లైంగిక దాడి


**న్యూఢిల్లీ:- 27 జూన్ (మహాప్రభ**



చైన్నైలో దారుణం చోటు చేసుకుంది. 17 ఏండ్ల బాలికపై(17-ఎముతీ-శీశ్రీస ర్బసవత్) ఆరుగురు వ్యక్తులు సామూహిక లైంగిక దాడికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల పరీక్షల్లో ఫెయిల్ అయిన సదరు విద్యార్థిని మళ్లీ పరీక్షలు రాసేందుకు సన్నద్ధమవుతున్నది. ఈ క్రమంలో చదువుకునేందుకు స్నేహితురాలి ఇంటికి వెళ్లిన బాలికపై ఆమెకు తెలిసిన స్నేహితుడు కన్నేసాడు. మాయమాటలు చెప్పి బైక్ ఎక్కించుకొని పోరూరు సమీపంలోని కెరుగంబాక్కం ప్రాంతంలో లైంగిక దాడికి పాల్పడ్డారు.అప్పటికే అక్కడి కి చేరుకున్న మరో ఐదుగురితో కలిసి ఈ ఘాతుకానికి ఒడిగట్టి పారిపోయారు. తీవ్ర అస్వస్థతకు గురైన బాలికను ఏమైందని తల్లిదండ్రులు ఆరా తీయగా తనపై జరిగి ఘోరాన్ని వివరించింది. వెంటనే బాలిక తల్లిదండ్రులు పోరూర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికను చికత్స కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

# వెనిజులాలో మరోసారి భూకంపం

**న్యూఢిల్లీ:- 27 జూన్ (మహాప్రభ**



వెనిజులాలో మరోసారి భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 4.9గా నమోదైంది. రెండు రోజుల క్రితం వరుసగా సంభవించిన రెండు భారీ భూకంపాల ధాటికి దేశంలో తీవ్ర విధ్వంసం చోటుచేసుకుంది. ఈ విపత్తులో 920 మంది మృతి చెందగా, 3 వేల మందికి పైగా గాయపడ్డారు. శిథిలాల కింద ఇంకా పలువురు చిక్కుకుపోయి ఉండొచ్చనే అనుమానంతో సహాయక బృందాలు యుద్ధ ప్రాతిపదికన రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగిస్తున్నాయి. తాజా భూకంపంతో ప్రజల్లో మరోసారి భయాందోళనలు నెలకొన్నాయి.

# ఆ అంశంపై కేంద్ర ప్రభుత్వం నోరు విప్పాలి

-సోనియాగాంధీ



**న్యూఢిల్లీ:- 27 జూన్ (మహాప్రభ**
గాజా యుద్ధం, పాలస్తీనా అంశంపై కేంద్ర ప్రభుత్వం మౌనం పాటిస్తోందంటూ కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ విమర్శించారు. పశ్చిమాసియా తో సంబంధాల విషయంలో భారత్ తన చారిత్రక వైఖరికి దూరమవుతోందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో ప్రత్యేక వ్యాసం రాశారు. అయితే విదేశాంగ విధానంపై కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందంటూ బీజేపీ కౌంటర్ ఇచ్చింది. గాజాలో పౌరుల మరణాలపై భారత్ బలంగా స్పందించడం లేదని సోనియా విమర్శించారు.పాలస్తీనా హక్కులకు మద్దతుగా భారత్ గతంలో అవలంభించిన విధానానికి ఇప్పుడు దూరమవుతోందని సోనియా పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి స్వతంత్ర దర్యాప్తు కమిషన్ నివేదికను ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. గాజాలో వేలాది మంది చిన్నారులు మరణించారని, మరెందరో గాయపడ్డారని తెలిపారు. అంతర్జాతీయ సమాజం ఇప్పటికీ ఈ ఘర్షణను నిలిపివేయడంలో విఫలమైందని వ్యాఖ్యానించారు. భారత్ ఈ అంశంలో 'ఒంటరి మౌన స్వరం' గా మారిందని సోనియా అన్నారు. ఇది నైతికంగానే కాకుండా జాతీయ ప్రయోజనాల కోణంలోనూ సమర్థించలేని వైఖరని పేర్కొన్నారు.పాలస్తీనాతో భారత్‌కున్న చారిత్రక సంబంధాలను కొనసాగిస్తూ కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా స్పందించాలని కోరారు. సోనియా వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. విదేశాంగ విధానం కంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని పార్టీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. గాజా అంశంపై భారత్ తన వైఖరిని ఇప్పటికే పలుమార్లు వెల్లడించిందన్నారు. కాల్పుల విరమణ తీర్మానాలపై ఐరాసలో ఓటు వేసిందని పేర్కొన్నారు. పాలస్తీనాకు మానవతా సాయం కూడా అందించిందని చెప్పారు.


# నిర్మాణం ఆలస్యమైతే బిల్డర్ ఇల్లు అప్పగించినా పరిహారం చెల్లించాల్సిందే



**న్యూఢిల్లీ:- 27 జూన్ (మహాప్రభ**
గృహ కొనుగోలుదారుల హక్కులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఫ్లాట్ నిర్మాణంలో జాప్యం జరిగినప్పుడు.. దానిని అప్పగించిన తర్వాత కూడా బిల్డర్ నుంచి నష్టపరిహారం కోరే హక్కు కొనుగోలుదారులకు ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. కేవలం ఫ్లాట్‌ను స్వీకరించినంత మాత్రాన ఆలస్యానికి సంబంధించిన నష్టపరిహారం పొందే హక్కు రద్దు కాదని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఈ తీర్పు రియల్ ఎస్టేట్ రంగంలో వినియోగదారుల హక్కులను మరింత బలోపేతం చేసింది.జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ వి మోహనలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. 2016 లో జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఇచ్చిన తీర్పును పక్కనపెట్టి, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఒక కేసును పునర్విచారణకు స్వీకరించింది. "నిర్మాణ జాప్యానికి సంబంధించిన నష్టపరిహారం అనేది ఫ్లాట్ అప్పగించడానికి ముందు కాలానికి వర్తిస్తుంది. కేవలం ఫ్లాట్‌ను స్వాధీనం చేసుకున్నంత మాత్రాన, ఆ జాప్యానికి పరిహారం కోరే హక్కును కొనుగోలుదారులు కోల్పోరు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.కాగా ఢిల్లీకి చెందిన టీకేఏ పద్మనాభన్ అనే వ్యక్తి అభియాన్ కోఆపరేటివ్ గ్రూప్ హౌసింగ్ సొసైటీపై 2005లో దాఖలు చేసిన కేసు విచారణ సందర్భంగా ఈ తీర్పు వెలువడింది. ఫ్లాట్ అప్పగింతలో తీవ్ర జాప్యం జరిగిందని ఆయన వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించారు. అయితే ఒప్పందంలోని ఆర్బిట్రేషన్ క్లాజ్‌ను ప్రాతిపదికగా తీసుకుని కింది కోర్టులు ఈ కేసును మధ్యవర్తిత్వానికి పంపాయి. ఈ వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. వినియోగదారుల రక్షణ చట్టం-1986 అనేది ప్రైవేట్ ఆర్బిట్రేషన్ నిబంధనలకు అతీతంగా వినియోగదారులకు అదనపు రక్షణ కల్పిస్తుందని న్యాయస్థానం స్పష్టంచేసింది. ఈ కేసును ఏడాదిలోగా పరిష్కరించాలని ద్వారక జిల్లా వినియోగదారుల ఫోరమ్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.

# షోయబ్ అక్తర్ సోదరుడి అంత్యక్రియలకు ఉగ్రవాదులు హాజరు.

పహల్గాం దాడి సూత్రధారి కూడా



**న్యూఢిల్లీ:- 27 జూన్ (మహాప్రభ**
పాక్ మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్ వివాదంలో చిక్కుకున్నాడు. షోయబ్ సోదరుడు షాహిబ్ అక్తర్ అంత్యక్రియలు ఇస్లామాబాద్‌లో జరిగాయి. ఈ కార్యక్రమానికి నిషేధిత సంస్థలకు చెందిన ఉగ్రవాదులు హాజరవ్వడం సంచలనంగా మారింది. వారిలో పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి సహా లష్కర్ ఎ తయిబాకు చెందిన ఉగ్రవాదులు పాల్గొన్నారు. అలాగే, స్థానిక రాజకీయ నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఈ నేపథ్యంలో పాకిస్తాన్‌లో ఉగ్రవాదులకు, స్థానిక రాజకీయ నాయకులకు, క్రీడాకారులకు మధ్య ఉన్న సంబంధాలు మరోసారి చర్చకు వస్తున్నాయి. ఉగ్రవాదులు బహిరంగంగానే తిరుగుతున్నా అక్కడి ప్రభుత్వం మాత్రం ఉగ్ర సంస్థలతో తమకేం సంబంధం లేదని ప్రకటిస్తూ ఉంటుంది. ఇక, తాజా అంశానికి సంబంధించి షోయబ్ సోదరుడు షాహిబ్ అక్తర్ అంత్యక్రియలకు లష్కర్ ఇ తయిబా డిప్యూటీ చీఫ్ సైఫుల్లా కసూరి హాజరయ్యాడు. గత ఏడాది కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి సూత్రధారుల్లో అతడు ఒకడు. ఈ దాడి తర్వాత కూడ సైఫుల్లా కసూరి భారత్‌కు పలుమార్లు హెచ్చరికలు జారీ చేశాడు. 26/11 తరహా దాడులు భారత్‌లో మళ్లీ నిర్వహిస్తామని హెచ్చరించాడు. లష్కర్ ఇ తయిబా సంస్థను ఐక్యరాజ్య సమితి ఉగ్రసంస్థగా గుర్తించి, నిషేధించింది. ఈ సంస్థ వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్ తనయుడు తల్హా సయీద్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాడు. అతడు కూడా ఈ సంస్థలో పని చేస్తున్నాడు.
అలాగే నిషేధిత ఉగ్ర అనుబంధ సంస్థ పాకిస్తాన్ మర్కాజి ముస్లిం లీగ్ (పీఎంఎంఎల్) సభ్యులు కూడా హాజరయ్యారు. ఇటు ఉగ్రవాదులు, స్థానిక రాజకీయ నేతలు అంత్యక్రియలకు హాజరవ్వడం ద్వారా ఉగ్రవాదులకు పాక్ ఏ విధంగా సహకరిస్తుందో అర్థమవుతోంది. ఈ విషయంపై భారత్ ఎప్పటినుంచో విమర్శలు చేస్తోంది. ఉగ్రవాదుల కేంద్రంగా పాక్ తయారైందని, వారిని ఆ దేశం రహస్యంగా కాపాడుతోందని పలు అంతర్జాతీయ వేదికలపై వెల్లడించింది.

# రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు

గుజరాత్‌లో ట్యాక్సీ సేవలు ప్రారంభించిన అమిత్ షా




**న్యూఢిల్లీ:- 27 జూన్ (మహాప్రభ**
రెండేళ్లల్లో 500 నగరాలకు ఈ ట్యాక్సీ సేవలు విస్తరిస్తాయని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. గుజరాత్‌లో తాజాగా భారత్ ట్యాక్సీ సేవలను ఆయన ప్రారంభించారు. కోఆపరేటివ్ మోడల్‌లో డ్రైవర్లే భాగస్వాములుగా ఉండే ఈ యాప్ ప్రారంభ వేడుకల్లో హోం మంత్రి ప్రసంగిస్తూ ట్యాక్సీ సేవలు ప్రస్తుతం నిత్యావసరంగా మారాయని అన్నారు. భారత్ ట్యాక్సీలో ఇలాంటి శ్రమదోపిడీ ఉండదని హోం మంత్రి హామీ ఇచ్చారు. ఒక న్యాయమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని అన్నారు. ఇటీవల కాలంలో ఈ రంగం గణనీయంగా విస్తరించిందని అన్నారు. ప్రస్తుతం ద్విచక్రవాహనాలు కూడా బైక్ ట్యాక్సీలుగా కుంభమేళా లాంటి భారీ ఈవెంట్స్‌లో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రైవేటు రైడ్ హెయిలింగ్ యాప్స్‌పై కూడా విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ యాప్‌లు ఒక క్రమపద్ధతితో శ్రమదోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రవాణా ఆపరేటర్లను డ్రైవర్లుగా పిలవడం కంటే సారథులని పిలుస్తానని చెప్పారు. ప్రైవేటు ఆపరేటర్లే అధిక శాతం లాభాలు దండుకుని వర్కర్లను వేధించిన ఘటనలు ఉన్నాయని అన్నారు. వినియోగదారులు, డ్రైవర్లకు ఎలాంటి నష్టం చేకూర్చని వ్యవస్థ ఇదేనని అన్నారు. ఇప్పటికే 7 లక్షల మంది డ్రైవర్లు ఈ యాప్‌లో భాగస్వాములయ్యారని అన్నారు. సుస్థిర ఆర్థిక భద్రతను సొంతం చేసుకున్నారని అన్నారు. భారత్ ట్యాక్సీలో రేట్లు ఎక్కువగా ఉన్నాయన్న వాదనలను కూడా హోం మంత్రి కొట్టిపారేశారు. ప్రత్యర్థి యాప్‌లు కావాలనే వ్యూహాత్మకంగా తమ ధరలను తగ్గిస్తున్నాయని కూడా హోం మంత్రి ఆరోపించారు. ఈ యాప్‌ను మార్కెట్ నుంచి తప్పించేందుకు ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. 'వాళ్లు ఇలా ఎంతకాలం చేయగలరు? భారత్ ట్యాక్సీ అలసిపోదు, యుద్ధ మైదానాన్ని వీడదు. నిలిచి పోరాడుతుంది. విజయం సాధిస్తుంది' అని అన్నారు. భారత్ ట్యాక్సీ దీర్ఘకాలిక అభివృద్ధికి సారథులు (డ్రైవర్లు), వినియోగదారులే బాధ్యులని అన్నారు. ఇతర కోఆపరేటివ్ సంస్థలు విజయం సాధించిన వైనాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

# ఇంకెన్ని పరీక్షలు లీక్ చేస్తారు?

మొదటి తరువాయి

మహారాష్ట్రలో టెట్ పరీక్ష పేపర్ లీకవ్వడం కలకలం సృష్టిస్తోంది. వీటిలో నీట్ జాతీయస్థాయి పరీక్ష కాగా, మహారాష్ట్ర టెట్ రాష్ట్రస్థాయి పరీక్ష. ఇటు దేశంలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే, అటు మహారాష్ట్రలో బీజేపీ ఆధ్వర్యంలోని మహాయుతి ప్రభుత్వాలే అధికారంలో ఉండటం విశేషం. ఈ నేపథ్యంలో పేపర్ లీకేజీ ఘటనల్లో బీజేపీ నిర్లక్ష్యంపై కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ), కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. "మరో పేపర్ లీకేజీ. మరో పరీక్ష రద్దు. ఈసారి మహారాష్ట్ర టెట్. దేశంలోని విద్యావ్యవస్థ, పరీక్షా నిర్వహణ వ్యవస్థ ఒక దోపిడీ వ్యవస్థగా మారింది. దేశంలోని ప్రతి యువకుడు అభద్రతతో ఉన్నాడు. ఇది పేపర్ లీకేజీ కాదు. యువత భవిష్యత్తును కొల్లగొట్టడం" అంటూ రాహుల్ గాంధీ స్పందించారు. శరద్ పవార్ వర్గానికి చెందిన ఎన్సీపీ నేత అమోల్ మాటెలె కూడా టెట్ పేపర్ లీకేజీపై విమర్శలు గుప్పించారు. ఇంతకుముందు సీబీఎస్ఈ, నీట్ యూజీ పేపర్లు లీకవ్వగా, ఇప్పుడు టీచర్ల అర్హత పరీక్ష పత్రం లీకైందన్నారు. మిగతా పోటీ పరీక్షల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇటు పేపర్లు లీకవుతుంటే ప్రభుత్వం మాత్రం ఇతర పార్టీల్ని కొల్లగొట్టి, ఎంపీల్ని చేర్చుకోవడంలో బిజీగా ఉందన్నారు. ఈ ప్రభుత్వం లీకేజీలు, కుట్రలకు కేంద్రంగా మారిందన్నారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రభుత్వానికి పరీక్షలు నిర్వహించే సత్తా లేదని విమర్శించారు. పార్టీల్ని విడదీయడం, ఎంపీల్ని, ఎమ్మెల్యేల్ని కొనడం మీదే దృష్టి పెట్టిందన్నారు. పేపర్లు లీక్ చేయడానికి దేశంలో ఇంకా ఏమైనా పరీక్షలు మిగిలి ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. ఆదివారం జరగాల్సిన మహారాష్ట్ర టెట్ పరీక్ష లీక్ కారణంగా రద్దైన సంగతి తెలిసిందే. ఈ పేపర్ లీకేజీపై విచారణ జరుగుతోంది.

# హార్ముజ్ లో మళ్లీ ఉద్రిక్తతలు

మొదటి తరువాయి

అమెరికా సైన్యం ఇరాన్ భూభాగంలోని కీలక క్షిపణి, డ్రోన్ నిల్వ కేంద్రాలు, తీరప్రాంత రాడార్ స్థావరాలే లక్ష్యంగా భీకర దాడులు నిర్వహించింది.

అయితే, ఈ కాల్పుల విరమణ ఒప్పంద గడువు ముగియక ముందే ఇరాన్ దానిని ఉల్లంఘించిందని అమెరికా ఆరోపించింది. అంతర్జాతీయ వాణిజ్య నౌకలపై ఇరాన్ దళాలు జరిపిన దాడులకు సమాధానంగానే తాము ఈ శక్తివంతమైన ప్రతిదాడి చేయాల్సి వచ్చిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ అధికారికంగా ప్రకటించింది. ఈ దాడుల తీవ్ర తకు దక్షిణ ఇరాన్‌లోని వ్యూహాత్మక ప్రాంతమైన సిరిక్ సమీపంలో వరుసగా మూడు కంటే ఎక్కువ భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు ఇరాన్ ప్రభుత్వ అధికారిక వార్తా ఛానల్ ఐఆర్ఐబీ పేర్కొంది.

**అమెరికా సైనిక స్థావరాలపై దాడులు చేశాం: ఇరాన్**

అమెరికా జరిపిన వైమానిక దాడులకు ప్రతీ కారంగా తాము కూడా ఈ ప్రాంతంలో అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులతో దాడులు చేసినట్లు ఇస్లామిక్ రివల్యూ షనరీ గార్డ్ కార్ప్స్ (ఐజీఆర్సీ) ప్రకటించింది. అమెరికా తమ డ్రోన్, రాడార్ కేంద్రాలను దెబ్బ తీసినందుకు బదులుగానే ఈ ప్రతిదాడి జరిపినట్టు పేర్కొన్నప్పటికీ, భద్రతా కారణాల దృష్ట్యా అమెరికాకు చెందిన ఏ నిర్దిష్ట స్థావరాలపై దాడులు చేశారనే పూర్తి వివరాలను ఇరాన్ సైన్యం వెల్లడించలేదు.

**ఖండించిన ట్రంప్**

ఇరాన్ దాడిని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా ఖండించారు. హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న అంతర్జాతీయ వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ కనీసం నాలుగు డ్రోన్లను ప్రయోగించిందని ఆయన వెల్లడించారు. ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లలో మూడింటిని తమ సాయుధ దళాలు గాల్లోనే విజయవంతంగా కూల్చివేసాయని పేర్కొన్నారు. కానీ, దురదృష్టవశాత్తూ ఒక డ్రోన్ అత్యంత ఖరీదైన పెద్ద కార్గో నౌక పైభాగంలో బలంగా దూసుకెళ్లిందన్నారు. దీనివల్ల ఆ నౌకకు కొంత నష్టం వాటిల్లిందని ట్రంప్ చెప్పారు. ఇరాన్ చేసిన ఈ పని స్పష్టంగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిం చడమే అని ట్రంప్ స్పష్టం చేశారు. కాల్పుల విరమ ణకు సంబంధించి అమెరికా, ఇరాన్ దేశాలు ఇటీవలే ఒక అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం ఇరాన్ ఎలాంటి అదనపు రవాణా రుసుములు లేదా ఆంక్షలు విధించకుండా 60 రోజుల పాటు హార్ము జ్ ద్వారా అంతర్జాతీయ వాణిజ్య నౌకల రాకపోకలను సజావుగా సాగనివ్వా లి. ఇందుకు బదులుగా అమెరికా సైన్యం ఆ ప్రాంతం లో విధించిన నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేసి, ఇరాన్‌తో 60 రోజుల పాటు దౌత్యపరమైన అణు చర్చలు ప్రారంభించడానికి అంగీకరించింది.

# ఆఫ్ఘనిస్థాన్‌లో 6.2 తీవ్రతతో భూకంపం..

మొదటి తరువాయి

భూకంపం కారణంగా, శనివారం సాయంత్రం ఢిల్లీ, జమ్ముకశ్మీర్‌తో పాటు ఉత్తర భారత రాష్ట్రాల్లో బలమైన భూ ప్రకంపనలు సంభవించాయి. ఈ భూకంప కేంద్రం ఆఫ్ఘనిస్థాన్‌లో ఉన్నదని, రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.2గా నమోదైనట్లు భూకంప కార్యకలాపాలను పర్యవేక్షించే 'నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ' వెల్లడించింది. అయితే ప్రాణ, ఆస్తి నష్టాల వివరాలు ఇంకా తెలియలేదు.

# నేడు నల్లగొండకు సీఎం

మొదటి తరువాయి

స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో జరుగుతున్న అన్యాయంపై తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఇక్కడి పరిశ్రమల్లో మేనేజ్మెంట్, టెక్నికల్, ఆఫీస్ జాబ్ లన్నీ ఇతర జిల్లాల వారికి, వేరే రాష్ట్రాల వారికి కట్టబెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానికులకు కేవలం స్వీపింగ్, సెక్యూరిటీ గార్డు, డైలీ లేబర్ వంటి తక్కువ జీతం వచ్చే శారీరక శ్రమతో కూడిన పనులు మాత్రమే ఇస్తున్నారు. పరిశ్రమల యాజమాన్యాలు స్థానిక కోటాను అమలు చేసేలా సీఎం రేవంత్ తన పర్యటనలో కఠినమైన ఆదేశాలు జారీ చేయాలని, లేదా జిల్లాకు ప్రత్యేకంగా ఐటీ టవర్స్, కాలుష్య రహిత ఉపాధి కల్పించే పరిశ్రమలను ప్రకటించాలని నిరుద్యోగ యువత కోరుతున్నారు.

**హైమ్ రోడ్ల ప్లాన్ ఆవిష్కరణ**

సీఎం పర్యటనలో భాగంగా కనగల్ మండలంలో ఏపీసీ మార్కెట్ యార్డ్ వద్ద ఆర్ అండ్ బి 'హైమ్' రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్లాన్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం నల్లగొండ కార్పొరేషన్ పరిధిలో తొలి విడత తాగునీటి సరఫరా ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేస్తారు. ఎన్జీ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో సీఎం మాట్లాడతారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళా ప్రతినిధులకు కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆర్థిక సాయం, బ్యాంక్ లింకేజీ చెక్కులను పంపిణీ చేస్తారు.

**వరాలు కురిపించే..?**

రూ. 13 వేల కోట్ల రోడ్ల నెట్‌వర్క్, జిల్లా ముఖ్యచ్రాన్ని మార్చునున్నప్పుడికే దశాబ్దాలుగా వేధిస్తున్న కీలక సమస్యలపై సీఎం ఎలాంటి ప్రకటన చేస్తారనే ఉత్కంఠ నెలకొంది. జిల్లాలోని పరిశ్రమల్లో 75 శాతానికి పైగా ఉద్యోగాలు దక్కేలా చట్టాన్ని కఠినతరం చేసే ప్రస్తావన వేదికపై నుంచే వస్తారా అనే చర్చ జరుగుతున్నది. హైదరాబాద్ శివార్ల నుంచి నల్లగొండ మీదుగా ప్రవహిస్తున్న మూసీ నది ప్రక్షాళనపై ప్రత్యేక ప్యాకేజీ లేదా కార్యచరణ ప్రకటిస్తారా..! అని ఎదురుచూస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా నత్తనడకన సాగుతున్న శ్రీశైలం ఎడమగట్టు కాలువ సాగునీటి పనులకు నిధులు కేటాయించి, మునుగోడు, దేవరకొండ ప్రాంతాల సాగునీటి కష్టాలు తీర్చాలనే డిమాండ్ కూడా వినిపిస్తున్నది.ం

మునుపటిలా అదనపు సుంకాలు విధిస్తాం..

# మునుపటిలా అదనపు సుంకాలు విధిస్తాం..




**వాషింగ్టన్**

అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీషన్ గ్రీర్ ఈ వారంలో భారత్‌లో పర్యటిస్తున్న క్రమంలో ఆ దేశ ఖజానా కార్యదర్శి స్కాట్ బెసెంట్ ప్రపంచ దేశాలకు తాజా హెచ్చరిక జారీ చేశారు. అదనపు సుంకాలు విధించరాదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా 301 సెక్షన్ కింద ఆయా దేశాలపై అదనపు సుంకాలు విధిస్తామని ఆయన పేర్కొన్నారు.కాగా, భారత్–అమెరికా మొదటి విడత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ)ను ఖరారు చేసుకునేందుకు భారత వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో గ్రీర్ చర్చలు జరిపారు. వాణిజ్య ఒప్పంద ఖరారుకు అతి దగ్గరలో ఉన్నట్టు ప్రకటించారు.

**ట్రంప్ సుంకాల హెచ్చరిక**

అమెరికన్ కంపెనీలపై డిజిటల్ సేవల పన్ను విధించే ఏ దేశం నుంచైనా వచ్చే అన్ని వస్తువుల పైనా 100 శాతం సుంకాన్ని విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు.


# వీబీ గ్రామ్ జీని అంగీకరించం

మొదటి తరువాయి

అధికారాలను కేంద్రం హరిస్తోందని విమర్శించారు. ఇది కేవలం ఉపాధి హామీ చట్ట సవరణ మాత్రమే కాదనీ, భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిపైనే జరుగుతున్న ప్రత్యక్ష దాడి అని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను క్రమంగా తగ్గించి, గ్రామీణాభివృద్ధిపై రాష్ట్రాల పాత్రను నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతోనే కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదల భవిష్యత్‌ను తాకట్టు పెట్టే చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయదని తేల్చి చెప్పారు. అవసరమైతే ఈ చట్టంపై సుప్రీంకోర్టులో సవాలు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోందని చెప్పారు. సమాఖ్య వ్యవస్థను విశ్వసించే ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఉత్తమ్ పేర్కొన్నారు. కర్నాటక, కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రులతో సంప్రదింపులు జరిపి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని అన్నారు. సమావేశంలో పాల్గొన్న 20 పౌరసంఘాలు కేంద్ర ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం స్వంత ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలని వారు సూచించారని చెప్పారు. 60 రోజుల ఉపాధి పరిమితిని పూర్తిగా వ్యతిరేకిస్తూ, ప్రతి గ్రామీణ కుటుంబానికి కనీసం 200 రోజుల ఉపాధి కల్పించాలనీ, చట్టబద్ధ కనీస వేతనాలు చెల్లించాలని పౌరసంఘాలు ప్రభుత్వాన్ని కోరాయని మంత్రి వివరించారు. కేంద్రం ప్రతిపాదించిన 60:40 నిధుల భాగస్వామ్య విధానం తెలంగాణపై వేల కోట్ల రూపాయల అదనపు భారాన్ని మోపే ప్రమాదం ఉందనీ, ఈ అంశాన్ని రాష్ట్ర న్యాయశాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని తెలిపారు. పనితీరు బాగున్న రాష్ట్రాలను శిక్షిస్తూ, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించేలా కేంద్రం రూపొందించిన నిధుల కేటాయింపు విధానం అన్యాయమన్నారు. ఈ అంశంపై జులై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. సమీక్ష?లో పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి దానకిశోర్, కమిషనర్ డి.దివ్య తదితరులు పాల్గొన్నారు.

# జూలై 2 వరకు విస్తారంగా వానలు

**-పుంజుకుంటున్న నైరుతి రుతుపవనాలు**
**-చురుకుగా కదులుతున్నాయన్న వాతావరణ శాఖల**
**-పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్**
**-40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు**
**-హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన**



హైదరాబాద్

నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి రోజులు గడుస్తున్నా వర్షాలు లేక తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని కబురు అందించింది. రుతుపవనాలు ఆలస్యంగా పుంజుకోవడంతో రాష్ట్రంలో వర్షపాతం కొరత ఏర్పడింది. అయితే తాజాగా రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, దీని ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా రానున్న ఏడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టంచేసింది. వాతావరణ కేంద్రం తాజా అంచనాల ప్రకారం.. ఇవాళ ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీచేశారు. వీటితోపాటు హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షసూచన నేపథ్యంలో వాతావరణ శాఖ తెలంగాణకు 'ఆరెంజ్ అలర్ట్' జారీచేసింది. జూలై 2వ తేదీ వరకు వర్షాలు కొనసాగుతాయని పేర్కొన్నది. ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఒకటి రెండు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అదే సమయంలో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మాత్రం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలే నమోదయ్యే సూచనలు ఉన్నాయని వివరించింది. ఇక రాజధాని హైదరాబాద్‌లోనూ వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండటంతో ఉక్కపోత నుంచి నగరవాసులకు ఉపశమనం లభించింది. ఇవాళ మధ్యాహ్నం తర్వాత తేలికపాటి జల్లులతో ప్రారంభమై, సాయంత్రం 6 గంటల తర్వాత వర్షం తీవ్రత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాత్రి వేళ నగరంలో భారీ వర్షం కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.

# హైడ్రాతో కాంగ్రెస్ దుర్మార్గాలు

- ఫ్యూచర్‌సిటీ పేరిట రేవంత్ బంధువుల భూ దందా
- ఎస్సీ, ఎస్టీ, అసైన్డ్ భూములు దోచుకుంటున్నరు
- ఫార్మాసిటీ భూములను ఫ్యూచర్‌సిటీకి వాడుతుండ్రు
- పెట్టుబడులు పెట్టాలనుకునేవారు ఆలోచించుకోవాలి
- మహేశ్వరంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- విరుద్ధంగా భూములు కేటాయిస్తే చట్టం ఊరుకోదు
- ఎన్నికలెప్పుడొచ్చినా కాంగ్రెస్ బంగాళాఖాతంలోకే
- సర్, సభ్యత్వంపై మహేశ్వరంలో శ్రేణులకు దిశానిర్దేశం



రంగారెడ్డి,

రాష్ట్రం లో హైడ్రాను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ సర్కార్ అనేక దుర్మార్గాలకు ఒడిగడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ముఖ్యంగా అధికారపార్టీ నేతలు, హైడ్రాను పావుగా వాడుకుంటూ అనేక చోట్ల భూములు కాజేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ, అసైన్డ్ భూములను అధికార పార్టీ నేతలు, ముఖ్యమంత్రి బంధువులు కొల్లగొడుతున్నారని, ప్రజా అవసరాలు, పరిశ్రమల పేరిట ఎస్సీ, ఎస్టీ, అసైన్డ్, ప్రభుత్వ భూములు, కుంటలను కాజేసే కుట్రలకు తెగబడుతున్నారని ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో సర్, సభ్యత్వ నమోదుపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఫ్యూచర్‌సిటీ పేరిట రేవంత్ బంధువులు భూ దందాలకు తెరలేపారని ఆరోపించారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తామని చెప్తున్న ముఖ్యమంత్రి బీఆర్ఎస్ ప్రభుత్వం సేకరించిన 14 వేల ఎకరాల్లో మాత్రమే ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్నారని చెప్పారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో ఫార్మాసిటీ నిర్మించాలన్న లక్ష్యంతో రైతులను ఒప్పించి 14 వేల ఎకరాలు సేకరించారని, ఆ భూమిని ఫ్యూచర్‌సిటీకి కేటాయించడం చట్ట విరుద్ధమని చెప్పారు.

**పెట్టుబడులపై ఆలోచించుకోవాలి**

ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులు పెట్టి కంపెనీలు ఏర్పాటు చేయాలనుకునేవారు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, ఫార్మాసిటీ భూములను అక్రమంగా కేటాయించడం వల్ల పెట్టుబడులు పెట్టిన వారే నష్టపోతారని హితవుపలికారు. ముఖ్యంగా ముఖ్యమంత్రికే ఫ్యూచర్ లేదని, ఫ్యూచర్‌సిటీ కడుతామని గొప్పలు చెప్తున్నారని ఎద్దేవాచేశారు. మరోవైపు ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దుచేసి ఆ భూములను తిరిగి రైతులకే ఇస్తామని ప్రగల్భాలు పలికిన భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, కోదండరామ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, కోదండరెడ్డి వంటివారు ఆ భూములను రైతులకు ఎందుకు తిరిగి ఇవ్వలేక పోయారని ప్రశ్నించారు.

ఫ్యూచర్‌సిటీ పేరు చెప్పుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులు, ఆ ప్రాంత కాంగ్రెస్ నాయకులు రియల్‌ఎస్టేట్ దందా కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ భూములు, అసైన్డ్, ప్రభుత్వ భూములను టార్గెట్ చేసి లాక్కుంటున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ చుట్టూ ఉన్న ఫార్మా కంపెనీల వల్ల హైదరాబాద్ ప్రజలు కాలుష్యం బారిన పడుతున్నారన్న దూరదృష్టితో రంగారెడ్డి జిల్లాలో కాలుష్య రహిత అంతర్జాతీయ ప్రమాణాలతో ఫార్మా కంపెనీలు నిర్మించాలని నిర్ణయించారని గుర్తుచేశారు.

ఈ ప్రాంతంలో కాలుష్య రహిత ఫార్మాసిటీని నిర్మిస్తే 5 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు దక్కేవని చెప్పారు. కానీ, ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు లేనిపోని దుష్ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారని, ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన రైతులకు తిరిగి ఇండ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వలేదని చెప్పారు.

# సంజీవిని గేమ్‌ఛేంజర్ పథకం

మొదటి తరువాయి

కొనేందుకు సిద్ధంగా లేరు. చాలా మంది ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలో 20 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారు. భవిష్యత్‌లో పెద్ద కుటుంబాలను ఆదరిస్తాం. ఇంటి కోసం, రేషన్ కార్డు కోసం పిల్లలు, తల్లిదండ్రుల నుంచి విడిపోతున్నారు. చాలా దేశాల్లో జనాభా తగ్గిపోతోంది. జనాభా పెరగాల్సిన అవసరం ఉంది. 40 ఏళ్ల తర్వాత ఏం జరుగుతుందో దాని గురించి ఇప్పుడే ఆలోచిస్తాను. నా కంటే ఇన్నోవేషన్ తెచ్చేవారు ఎవరూ ఉండరు. ఇటీవల జెన్ జీ... జెన్ జీ మాట ఎక్కువగా వినిపిస్తోంది. నేనే అందరికంటే పెద్ద జెన్‌జీని. నా కంటే ఇన్నోవేటివ్‌గా ఆలోచించేవారు ఎవరూ ఉండరు. ఇన్నోవేషన్‌తో ముందుకు వస్తే అండగా ఉంటానని అన్నారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి. వెలిగొండ ప్రాజెక్టు.. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు జీవనాడి. ఈ రెండు ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతాం. గొడ్డలి పార్టీకి మద్దతు ఇచ్చేవారు ఆత్మవిమర్శ చేసుకోవాలి. అమరావతిపై వైకాపా కుట్రలు జరుగుతూనే ఉన్నాయి. అమరావతిని నంబర్ 1 నగరంగా, రాజధానిగా తీర్చిదిద్దుతాం. అమరావతి మా రాజధాని అని కాలర్ ఎగరేసి చెప్పుకొనేలా నిర్మిస్తాంఅని చంద్రబాబు అన్నారు. వైసీపీ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శలు గుప్పించారు. ప్రజల కోసమే కూటమి ఏర్పడిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. 3 వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నామన్నారు. అన్నదాతలకు అండగా నిలుస్తున్నామని.. ఏటా రైతులకు రూ.20 వేలు ఇస్తున్నామని చెప్పారు. మనసున్న ప్రభుత్వం కాబట్టే ప్రజలకు అన్నీ చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు పెరిగాయని.. ప్రైవేటు స్కూళ్ల నుంచి లక్ష మంది ప్రభుత్వ బడుల్లో చేరారని తెలిపారు. అందరికీ సంపూర్ణ ఆరోగ్యం కోసమే సంజీవని పథకాన్ని తీసుకొచ్చామని సీఎం చెప్పుకొచ్చారు. ఎవరికైనా ఆరోగ్యం ఉంటేనే ఆనందమని.. సంజీవని ద్వారా వేగవంతంగా వైద్య సేవలు అందజేస్తామన్నారు. మన మిత్ర ద్వారా ఇంటి దగ్గరకే సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. 'భవిష్యత్తులో పిల్లలే మన ఆస్తి. ఒకరు వద్దు.. ముగ్గురు ముద్దు. చాలా దేశాల్లో జనాభా తగ్గిపోతోంది' అని అన్నారు.

# నేడు పల్స్ పోలియో

హైదరాబాద్

నేడు(ఆదివారం) రాష్ట్ర వ్యాప్తంగా పోలియో చుక్కలు వేయనున్నారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోని వారికి ఈ నెల 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వేసేలా వైద్యారోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలియో చుక్కలు వేసుకోకుండా ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా బూత్ లు, బృందాలు ఇంటింటి సర్వేల ద్వారా పోలియో డ్రాప్స్ అందించేలా చర్యలు తీసుకున్నారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోగా, మిగిలిపోయిన చిన్నారులకు ఈ నెల 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేసేందుకు ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలియో చుక్కల కోసం రాష్ట్రవ్యాప్తంగా 22,979 పోలియో బూత్ లు, 903 మొబైల్ బృందాలు, 903 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేశారు. సుమారు 40.97 లక్షల మంది 0–5 ఏళ్ల చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఇందుకోసం 52.04 లక్షల డీవీపీ డోసులను జిల్లాలకు సరఫరా చేశారు. పోలియో చుక్కల కార్యక్రమంలో 8,393 ఏఎన్ఎంలు, 27,181 ఆశా కార్యకర్తలు, 34,442 అంగన్‌వాడీ కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు.

# గోదావరి వరదలపై అప్రమత్తం కండి

మొదటి తరువాయి

చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గోదావరి వరదల సన్నద్ధతపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశంలోపలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గత వరదల అనుభవాలను పరిగణలోకి తీసుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశర చేశారు. వరదల వల్ల రహదారులు బ్లాక్ అయ్యే గ్రామాలను గుర్తించాలని సూచించారు. అత్యవసర వైద్యసేవలు, నిత్యావసర వస్తువుల రవాణాకు అడ్డంకులు లేకుండా యాక్షన్ ఎ÷–లాన్ ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, వైద్యం వంటి అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ సమీక్షకు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏపీఓ రాహుల్, మేయర్ మూడ్ గణెళిశ్, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు.

# అప్పుల ఊబిలో పాక్!..

రూ 81.9 ట్రిలియన్లకు చేరిన రుణం




**న్యూఢిల్లీ**

పాకిస్థాన్ కేంద్ర ప్రభుత్వ అప్పులు చరిత్రలో ఎన్నడూ లేని స్థాయికి చేరాయి. ఏప్రిల్ నెలలోనే రూ.1.4 ట్రిలియన్ల మేర పెరగడంతో మొత్తం కేంద్ర ప్రభుత్వ అప్పులు రూ.81.93 ట్రిలియన్లకు చేరాయని 'బిజినెస్ రికార్డర్' నివేదిక వెల్లడించింది. ప్రభుత్వ పనులకు అప్పుల మీదనే ఆధారప డటమే ప్రధాన కారణం.పది నెలల్లోనే అప్పులు రూ.4 ట్రిలియన్లకు పైగా పెరిగాయి. ఇందులో దేశీయ అప్పులు రూ.3.6 ట్రిలియన్లకు పైగా ఉంటే, విదేశీ అప్పులు రూ.400 బిలియన్లుగా ఉన్నాయి.

## సంపాదకీయం

# ప్రజల్లో ప్రశ్నించే తత్వం చచ్చిపోయిందా ?



దృశ్యం సినిమాలో హీరో ఓ వ్యక్తిని చంపి మాయం చేస్తాడు. పోలీస్ అధికారి కొడుకైన అతడి ఆచూకీ కోసం పోలీసులు ఎంతగా ప్రయత్నించినా పట్టుకోలేక పోతారు. శవాన్నా మాయం చేసినా గుర్తించలేక పోతారు. ఆధారాలు లేకుండా చంపేసి, పోలీస్ స్టేషన్‌లోనే పాతిపెట్టినా కనిపెట్టలేక పోతారు. ఇప్పుడు అచ్చంగా ఇలాంటి కథే ఒకటి విజయవాడలో చోటుచేసుకుంది. సాయికృష్ణ కస్టోడియల్ డెత్ జరిగి దాదాపు నెలదాటినా ఆచూకీ కనిపెట్టడం లేదు. ఎందుకంటే మాయమైన వ్యక్తిపై రౌడీషీట్ ఉంది. అందులోనూ ఓ సామాన్యుడు. ఘనత వహించిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాధించిన విజయమిది. జగన్ హయాంలోనూ ఓ డాక్టర్‌ను పిచ్చోడిని చేసి చంపారు. పిల్లలు మాయం అయ్యారు. పట్టించుకోలేదు. ఇకపోతే సాయికృష్ణ ఏమయ్యాడో అన్న సందర్భంలోనే తునిలో జ్ఞానేశ్వరి అనే ఓ చిన్నారి కూడా మాయం అయ్యింది. ఇప్పటికీ ఆమె ఆచూకీ కనుక్కోలేక పోయారు. నిజంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రజలు స్పందించడం లేదు. మనుషులు చస్తున్నా, మాయం అవుతున్నా సమాజాం ఎందుకో నిస్తేజంగా మారిపోయింది. హక్కుల గురించి మాట్లాడే నేతల నోళ్లు మూతపడ్డాయి. ఆందోళన చేసేవారు కనిపించడం లేదు. ఎర్రజెండాల వాళ్లకు ఏమయ్యిందో కనిపించడం లేదు. పౌరహక్కుల కోసం అంటూ మాట్లాడే వారు మాయం అయ్యారు. అన్యాయాలు జరుగుతున్నా ప్రజలు ప్రశ్నించే శక్తని కోల్పోయారు. ఈ మధ్యే పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ వారు కూడా ఎక్కడా కిమ్మనడం లేదు. కొందరు ఆ మధ్య హైదరాబాద్ లో తామంతా కాక్రోచ్ అంటూ బయలుదేరారు. విజయవాడలో కస్టోడియల్ డెత్‌కు గురయ్యాడంటూ సిట్ చెప్పినా సాయికృష్ణణ వ్యవహారం గురంచి ఒక్కరు కూడా మాట్లాడడం లేదు. రాజకీయ లబ్ది కోసం వైకాపా నేతలు మాట్లాడినా అది ప ఎద్దగా ప్రభావం చూపడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో సాయకృష్ణ అనే వ్యక్తి ఇప్పటికీ కనిపించడం లేదు. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తిని కొట్టి చంపేశారు. చంపితే శవాన్ని ఇవ్వాలి. కానీ శవాన్ని ఇవ్వలేదు. మాయం చేశారు. కాల్చేశారా పాతరేశారా లేక కృష్ణానదిలో ఉన్న మొసళ్లకు ఆహారంగా వేశారా అన్ని తెలియదు. సిట్ మాత్రం కస్టోడియల్ డెత్ అంటూ కోర్టుకు నివేదించింది. అయితే మరి శవం ఏమయ్యిందనేదే ప్రశ్న. వియజవాడలో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న సాయికృష్ణ మిస్సింగ్ కేసులో, తన కుమారుడు సాయి కృష్ణ చనిపోయాడని ధృవీకరిస్తూ సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 19న అతని తల్లి విజయలక్ష్మి సీపీ రాజశేఖర్ బాబుకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టుకెళ్లినట్లు గుర్తించిన ఆమె సాయి కృష్ణ ఎక్కడున్నాడనే ప్రశ్నలకు తెరదించుతూ అతను చనిపోయడని తల్లి విజయలక్ష్మి తన ఫిర్యాదులో ధృవీకరించినట్లు తెలస్తోంది. సిఐ నాగరాజు తన కుమారుడిని తన కళ్ళెదుటే కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మే నెల మొదటి వారంలో సాయికృష్ణను పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్‌తో కృష్ణలంక, మాచవరం పోలీసు స్టేషన్లో తీసుకొని వచ్చారని.. కృష్ణలంక స్టేషన్‌కు తెచ్చాకా సిఐ నాగరాజు తన కోడుకుని చంపేస్తాం దండ రెడీ చేసుకో అన్నారని ఆమె చెప్పుకొచ్చింది. అయితే సిఐ నాగరాజు సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కోర్టులో హాజరు పరచలేదని.. సాయి కృష్ణను అక్రమంగా నిర్బంధించి చిత్ర హింసలకు గురిచేసి తీవ్రంగా కొట్టారని ఆమె ఆరోపించింది. సిఐ నాగరాజు కొట్టిన దెబ్బలకు సాయి కృష్ణ చనిపోయాడని.. లాకప్ లో సాయి కృష్ణను కొట్టినప్పుడు అరుపులు కేకలు తాను విన్నానని ఆమె చెప్పుకొచ్చింది. తన కొడుకుని తనతో పంపమని అడిగితే.. తనపై సీఐ నాగరాజు గట్టిగా అరిచాడని ఆమె ఆరోపించింది. దీంతో ఏం చేయాలో తోచక తన చెల్లెలు ద్వారా హై కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ ఫైల్ చేశామని.. సాయి కృష్ణ చనిపోయాడనే విషయం ఇబ్బందవుతుందని తన

కుమారుడు శవాన్ని నామరూపాలు లేకుండా తగలబెట్టారని కూడా విజయలక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. సాయి కృష్ణను చంపి ఆధారాలు లేకుండా చేసిన సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని విజయలక్ష్మి డిమాండ్ చేసింది. విజయలక్ష్మీ ఫిర్యాదు ఆధారంగా సిఐ నాగరాజుపై అక్రమంగా నిర్బంధించడం, ఆధారాలు ధ్వంసం చేయడం,హత్య చేసిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు సాయికృష్ణ కస్టోడియల్ డెత్ చెందాడంటూ కోర్టుకు నివేదించారు. ఈ కేసు ప్రత్యేక విచారణ బృందం అధికారులు, నిందితుడైన సీఐ నాగరాజు రిమాండ్ రిపోర్టును విజయవాడ రెండవ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సమర్పించారు. చట్టవిరుద్ధంగా నిర్బంధించడం, పోలీస్ స్టేషన్‌లోనే దారుణంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, ఆపై ఆధారాలు దొరకకుండా శవాన్ని తగలబెట్టి మాయం చేయడం వంటి విషయాలను సిట్ నిర్ధారించింది. పోలీసుల థర్డ్ డిగ్రీ వల్లే సాయికృష్ణ చనిపోయాడని, ఆ తరువాత మృతదేహాన్ని సీఐ నాగరాజు వేరే చోటుకు తరలించి దహనం చేశారని రిమాండ్ రిపోర్టులో తెలిపింది. డిజిటల్ సాక్ష్యాలను సైతం మాయం చేయడంతో పాటు విచారణలోనూ సహకరించలేదని సిట్ కోర్టుకు తెలిపింది. నిజంగా ఇంత జరిగినా సిఎం చంద్రాబు పెద్దగా స్పందించలేదు. సిట్ వేసి మిన్నకున్నారు. ఓ మహిళ హోంమంత్రిగా ఉన్నా ఓ తల్లికి న్యాయం జరగలేదు. సాయికృష్ణ రౌడీషీటర్ అయితే, కేసులు పెట్టి బొక్కలో తోయాలి. కానీ ఉగ్రవాదిని చంపినట్లు చంపేశారు. తగులబెట్టేశారు. ఆధారాలు మాయం చేశారు. ఇంత జరుగుతున్నా, పోరాటాల గడ్డ బెజవాడ కిమ్మనడం లేదు. ఎర్రజెండా పార్టీల నోళ్లు మూతలు పడ్డాయి. దీనిని ఓ కేసుగా పెద్దగా ఎవ్వరూ పరిగణించడం లేదని తేలింది. దీంతో ఎలాంటి సందేశాన్ని ఇవ్వాలనుకుంటున్నరో కూటమి పెద్దలు చెప్పాలి. ఓ వ్యక్తి కస్టోడియల్ డెత్ ఇప్పుడు సామాన్య వార్తగా మారడం విషాదం.

## జూలై 3లోపు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, – 27 జూన్ (మహాప్రభ )**
ఓటరు నమోదు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా జూలై 3వ తేదీలోపు ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.శనివారం పెద్దపల్లి పట్టణంలోని ప్రగతి నగర్‌లో కొనసాగుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి ఓటరికి రెండు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయాలని, ఒకటి వివరాలతో నింపి స్వీకరించగా, మరొకటి రసీదుగా తిరిగి ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు బీఎల్‌వోలకు సహకరించి ఫారాల పంపిణీని వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఇంటికి చేరుకొని పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ రాజయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తవక్లాపూర్‌లో ప్రజల సమస్యలపై వెంటనే స్పందించిన సర్పంచ్



**దేవరకొండ, – 27 జూన్ (మహాప్రభ )**
డిండి మండలం తవక్లాపూర్ గ్రామంలో మూడు నెలల క్రితం ప్రారంభమైన రహదారి పనులు మధ్యలో నిలిచిపోవడంతో రోడ్డు మొత్తం గుంతలతో నిండిపోయింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఆ గుంతలు నీటితో నిండిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో దుర్వాసన వ్యాపించి, పరిసర ప్రాంత ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.ఈ సమస్యను గ్రామ ప్రజలు సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి గుంతలను మట్టితో పూడ్చే పనులు ఈరోజే ప్రారంభించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా గ్రామ అభివృద్ధి పట్ల తన కట్టుబాటును మరోసారి చాటుకున్నారు.గ్రామ ప్రజలు మాట్లాడుతూ, సమస్యలపై వెంటనే స్పందిస్తూ, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్యకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## బోగస్ ఓట్ల నిర్మూలనకు సమగ్ర సవరణ ప్రారంభం



**షాద్‌నగర్, – 27 జూన్ (మహాప్రభ )**
ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత పారదర్శకంగా, పటిష్ఠంగా మార్చేందుకు బోగస్ ఓట్ల నిర్మూలన లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు.రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులుకు ఎన్యూమరేషన్ ఫారాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అందజేశారు. అనంతరం గ్రామంలోని పలువురు ఓటర్లకు కూడా ఫారాలను పంపిణీ చేసి, ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో ప్రతి పౌరుడికి ఒకే చోట ఒకే ఓటు ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కుల, మత, రాజకీయ భేదాలకు అతీతంగా ఓటరు జాబితాను ప్రక్షాళన చేసే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బీఎల్ఓలు, బీఎల్ఏలు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం అని, ప్రజలు తమ ఓటు ద్వారా ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారని, రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కుల్లో ఓటు హక్కు ఒకటని పేర్కొన్నారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పారదర్శకంగా, సమర్థవంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, లింగారెడ్డిగూడ సర్పంచ్ ఎం.సి. ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ అశోక్, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, ఫరూక్‌నగర్ తహసీల్దార్ నాగయ్య, గ్రామ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వెనిజులా వేదన



ఒక్క క్షణం... అంతే! పిల్లల నవ్వులతో నిండిన ఇల్లు శిథిలాల కుప్పగా మారిపోయింది. తల్లి ఒడిలో ఆడుకుంటున్న చిన్నారి కాంక్రీట్ పలకల కింద చిక్కుకుపోయింది. భర్త కోసం భార్య, భార్య కోసం భర్త, పిల్లల కోసం తల్లిదండ్రులు, తల్లి దండ్రుల కోసం పిల్లలు, ఇలా ఎటుచూసినా, శిథిలాల మధ్య చేతులతోనే మట్టిని తొలగిస్తున్న దయనీయ గాథ అక్కడ కనిపిస్తోంది. గురువారం వెనిజులాను కుదిపేసిన భూకంపం భవనాలను మాత్రమే కాదు, వేలాది కుటుంబాల ఆశలనూ నేలమట్టం చేసింది. రక్షణ సిబ్బంది ప్రతి రాయిని జాగ్రత్తగా తొలగిస్తున్న కొద్దీ బయట పడుతున్నవి ప్రాణాలు కాదు, శవాలే. ఒకవైపు సైరన్ల మోతలు, మరోవైపు ఆర్తనాదాలు, ఇంకోవైపు 'ఎవరైనా బతికే ఉన్నారా' అంటూ వినిపిస్తున్న పిలుపులు. వారి హృదయ వేదనకు అద్దం పడుతోంది. సామ్రాజ్యవాద ఆర్థిక ఆంక్ష?లు, చమురు దోపిడీ, మధురో దంపతుల కిడ్నాప్ వంటి అనేక సమస్యల్ని ఎదుర్కొంటూ ఒక ఆశయ బలంతో ముందుకు సాగుతున్న దేశానికి ప్రకృతి విపత్తు కోలుకోలేని దెబ్బ తీసింది. వరుసగా సంభవించిన రెండు భూకంపాలు రిక్టర్ స్కేల్‌పై 7.2, 7.5గా నమోదై భారీనష్టాన్ని మిగిల్చాయి నిన్నటివరకు 589 మంది సజీవ సమాధి కాగా, మూడు వేలాది మంది గాయపడినట్లు సమాచారం. ఇప్పటికే వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, రహదారులు, తీతెనలు దెబ్బతిన్నాయి. ఆస్ప త్రులు రోగులతో నిండిపోయాయి. తాగునీరు, విద్యుత్, సమాచార వ్యవస్థలు స్తంభించిపోయాయి. అనేక గ్రామాలు, పట్టణాలు ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. ప్రతి గంట గడిచేకొద్దీ బతికున్న వారిని రక్షించే అవకాశాలు తగ్గుతున్నాయి. అయినప్పటికీ ఆశను వదలకుండా కొనసాగుతున్న సహాయక చర్యలు మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు అందరినీ ఒకేలా తాకవు. బలమైన భవనాల్లో నివసించే వారికంటే బలహీన గృహాల్లో నివసించే పేదలే ఎక్కువగా నష్టపోతారు. అత్యవసర వైద్య సేవలు, సురక్షిత నివాసం, ఆర్థిక భరోసా లేని ప్రజల జీవితాలే ఎక్కువగా నష్టపోతాయి. వెనిజులాలోనూ అదే జరిగింది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో జీవిస్తున్న లక్షలాది మందికి ఈ భూకంపం జీవనాధారాన్నే దూరం చేసింది. ఈ పాపం అమెరికా సామ్రాజదా వాదానిదే. ప్రపంచంలోనే అత్యధిక నిర్ధారిత చమురు నిల్వలు ఉన్న దేశం వెనిజులా. సహజ వాయువు, బంగారం, ఇనుము, బాక్సైట్, కొల్టాన్ వంటి అరుదైన ఖనిజ సంపద కూడా అపారం. ఒక దేశ అభివృద్ధికి ఈ సంపద వరంగా మారాల్సింది. కానీ సామ్రాజ్యవాద ప్రపంచ వ్యవస్థలో అదే సంపద శాపంగా మారింది. చమురు ఉన్న ప్రతి దేశంపై ఆధిపత్య పోరు నడిచిన,నడుస్తున్న చరిత్ర ప్రపంచం చూస్తున్నదే. వెనిజులా కూడా అందుకు మినహాయింపు కాదు. హ్యూగో చావెజ్ హయాంలో చమురు సంపదను ప్రజల సంక్షేమానికి వినియోగించేందుకు జాతీయం చేశారు. తర్వాత అదే బాటలో నడుస్తున్న నికొలాస్ మదురో ప్రభుత్వంపై అమెరికా వరుస ఆర్థిక ఆంక్షలు విధించింది. చమురు ఎగుమతులపై ఆంక్షలు, విదేశాల్లోని వెనిజులా ఆస్తుల స్తంభింపజేత, ప్రభుత్వ మార్పు ప్రయత్నాలు, అంతర్గత రాజకీ యాల్లో జోక్యం వంటివి ఆ దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా బలహీనపరిచాయి. ఇప్పటికే కష్టాల్లో ఉన్న ప్రజల జీవితాలు మరింత దుర్భరమయ్యాయి. ఇప్పుడు భూకంపం ఆ పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. ప్రభుత్వ ఆదాయంలో ప్రధాన భాగం చమురుపైనే ఆధారపడిన దేశానికి ఇది మరో పెద్ద ఆర్థిక సవాలుగా మారనుంది. అందుకే వెనిజులా ప్రజలకు ఇప్పుడు అత్యవసరంగా కావలసింది సానుభూతి కాదు, సంఘీభావంతో కూడిన సహాయం. శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడటం, నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడం, ఆహారం, తాగునీరు, వైద్య సేవలందించడం, పునర్నిర్మాణానికి అంతర్జాతీయ సహకారం ప్రపంచ దేశాల బాధ్యత. అయితే గత అనుభవాలు చూస్తే, బలహీన దేశాలు ప్రకృతి విపత్తులను ఎదుర్కొంటున్నప్పుడు సహాయం పేరుతో రాజకీయ షరతులు విధించడం, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ద్వారా విధానాలు మార్చాలని ఒత్తిడి తేవడం, సహజ వనరులపై బహుళజాతి సంస్థలకు అవకాశాలు కల్పించడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. వెనిజులా విషయంలో అలాంటి ప్రయత్నాలకు తావివ్వకూడదు. వెనిజులా శిథిలాలపై ఇప్పుడు రెండు శక్తులు నిలబడ్డాయి. ఒకటి ప్రాణాలను కాపాడాలని తపించే మానవత్వం. మరొకటి చమురు బావులు, బంగారు గనులు, ఖనిజ సంపదలనే చూసే సామ్రాజ్యవాదం. విజయం దేనిదైనా అది వెనిజులా భవిష్యత్తును మాత్రమే కాదు, ప్రపంచ మానవత్వం విలువలను కూడా నిర్ణయిస్తుంది. శిథిలాలపై లాభాల రాజకీయాలు కాదు, మానవత్వం పునర్నిర్మాణం జరగాలి. అదే ఈ విపత్తు ప్రపంచానికి నేర్పుతున్న గొప్ప పాఠం.

Highlights: వెనిజులా శిథిలాలపై ఇప్పుడు రెండు శక్తులు నిలబడ్డాయి. ఒకటి ప్రాణాలను కాపాడాలని తపించే మానవత్వం. మరొకటి చమురు బావులు, బంగారు గనులు, ఖనిజ సంపదలనే చూసే సామ్రాజ్యవాదం. విజయం దేనిదైనా అది వెనిజులా భవిష్యత్తును మాత్రమే కాదు, ప్రపంచ మానవత్వం విలువలను కూడా నిర్ణయిస్తుంది. శిథిలాలపై లాభాల రాజకీయాలు కాదు, మానవత్వం పునర్నిర్మాణం జరగాలి. అదే ఈ విపత్తు ప్రపంచానికి నేర్పుతున్న గొప్ప పాఠం.

## డ్రైనేజీ సమస్యలపై నాలుగో వార్డు కౌన్సిలర్ ఆందోళన

**- వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు విజ్ఞప్తి**



**తూప్రాన్ జూన్ 27,(మహాప్రభ)**
గత మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వీధుల్లో డ్రైనేజీ లోపం ఏర్పడిందని డ్రైనేజ్ పై మాట్లాడినారు. తక్షణమే స్పందించిన మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ డబుల్ బెడ్ రూమ్ వీధుల్లో నాలుగవ వార్డు వీధుల్లో పర్యటించి పరిశీలించినారు. వార్డులోని పలు మురికివాడలను ఓపెన్ మురికి నీళ్లలో నిలువ ఉండకుండా ముందు చర్యలు తీసుకోవాలని త్వరగా పూర్తి చేయాలని వార్డులు ఇలాగే కొనసాగితే ప్రజలు ఆస్పత్రిల పాలవుతారని వర్షాకాలం దృశ్య ప్రజలకు మందు జాగ్రత్తలు తీసుకోవాలని నాలుగో వార్డ్ కౌన్సిలర్ కమిషనర్ తో తెలిపారు. తక్షణమే పరిశుద్ధ పనులు చేపడతామని మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ హామీ ఇచ్చారు.

## గడ్డిఅన్నారంలో సీవరేజ్ సమస్యలపై మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ ఆరా..

**-అధికారులకు తక్షణ ఆదేశాలు**







**గడ్డిఅన్నారం- జూన్ 27 (మహప్రభ)**
ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న గుడ్ మార్నింగ్ గడ్డిఅన్నారం కార్యక్రమంలో భాగంగా మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ శనివారం ఉదయం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి సీవరేజ్ ఓవర్‌ఫ్లో సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
పర్యటన సందర్భంగా రోడ్లపైకి ప్రవహిస్తున్న కలుషిత నీటి వల్ల స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా గమనించిన ఆయన వెంటనే జలమండలి అధికారులకు సమాచారం అందించి, సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా స్పందించిన జలమండలి అధికారులు సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని అవసరమైన మరమ్మతు పనులను వేగవంతం చేసి, సీవరేజ్ ఓవర్‌ఫ్లో సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించడం తన బాధ్యత అని అన్నారు. పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన గడ్డిఅన్నారం నిర్మాణమే తన లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ క్షేత్రస్థాయిలో ఉండి సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ శాశ్వత పరిష్కారాల కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించే దిశగా గుడ్ మార్నింగ్ గడ్డిఅన్నారం కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

## మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు

**-కొండమల్లేపల్లి, ఎస్సై, అజ్మీర రమేష్**




**దేవరకొండ జూన్ 27( మహాప్రభ )**
దేవరకొండ నియోజకవర్గం లోని కొండమల్లేపల్లి మత్తు పదార్థాల పై పోలీస్ వ్యవస్థ అవగాహన సదస్సు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కొండమల్లేపల్లి ఎస్.ఐ. అజ్మీరా రమేష్ కోరారు. యువతలో సానుకూల ఆలోచనలు, విలువలు పెంపొందించి మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని "మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం" సందర్భంగా బస్ స్టాండ్ పరిధిలో పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం లోని కొండమల్లేపల్లి మండలంలో మారకద్రవ్యాల మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు మాదక ద్రవ్యాలు వ్యక్తిఅ జీవితాన్నే కాకుండా కుటుంబాలను విచ్చిన్నం చేస్తాయని, తద్వారా సమాజంపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలకు దారితీస్తాయని అన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ అక్రమ రవాణాను అరికట్టేందుకు అవగాహన, అప్రమత్తత, సామాజిక బాధ్యత ఎంతో అవసరమని పేర్కొన్నారుడ్రగ్ ఫ్రీ తెలంగాణ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సహకరించాలని ఎస్.ఐ అజ్మీర్ రమేష్ విజ్ఞప్తి చేశారు.

# జైన్ మందిరం వెనుక డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యపై మాజీ కార్పొరేటర్ పవన్ కుమార్ క్షేత్రస్థాయి పరిశీలన





**నాగోల్ - 27 జూన్ (మహాప్రభ )**
కొత్తపేట్ డివిజన్ పరిధిలోని జైన్ మందిర్ వెనుక లైన్ ప్రాంతంలో గత కొంతకాలంగా కొనసాగుతున్న డ్రైనేజ్ ఓవర్‌ఫ్లో సమస్యపై స్థానికుల ఫిర్యాదుల మేరకు మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ వెంటనే స్పందించి సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాంతంలో రోడ్లపై మురుగునీరు ప్రవహించడం, దుర్వాసన వెదజల్లడం, దోమల బెడద పెరగడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. సమస్యకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని, ప్రజలకు శాశ్వత ఉపశమనం కలిగించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పరిశీలన సందర్భంగా వాటర్ వర్క్స్ అధికారులు మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న డ్రైనేజ్ లైన్లు సుమారు 30 సంవత్సరాల క్రితం అప్పటి జనాభా అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేసినవని, ప్రస్తుతం జనాభా పెరుగుదలతో పాటు వినియోగం అధికమవడం వల్ల అవి పూర్తిగా ఓవర్‌లోడ్ అవుతున్నాయని తెలిపారు. దీంతో డ్రైనేజ్ ఓవర్‌ఫ్లో సమస్య తరచూ పునరావృతమవుతోందని వివరించారు.
ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలకు ఇలాంటి ఇబ్బందులు శాశ్వతంగా తొలగించేలా పాత డ్రైనేజ్ లైన్ల స్థానంలో అధిక సామర్థ్యం కలిగిన కొత్త డ్రైనేజ్ లైన్ల ఏర్పాటుకు సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనులను పర్యవేక్షిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన ప్రతి సమస్యపై ఇదే విధంగా వెంటనే స్పందిస్తూ క్షేత్రస్థాయిలో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ స్రవంతి , ఆరిఫ్ , సూపర్వైజర్ దయాకర్ , కాలనీవాసులు మురలీకృష్ణ , సాయి మోహన్ గారు, ప్రభాకర్ , బీజేపీ డివిజన్ అధ్యక్షులు మంచి రాజేష్ కుమార్ , వగ్గల సుందర్ నారాయణ , గట్టు మహేష్ కుమార్ , కొమ్ము శివ తదితరులు పాల్గొన్నారు.

# బూత్ గెలుపే బీజేపీ విజయానికి పునాది

**-విజయ సంకల్ప సమ్మేళనాన్ని చారిత్రాత్మకంగా విజయవంతం చేయాలి: ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి**



**గడ్డిఅన్నారం -27 జూన్ (మహాప్రభ )**
గడ్డి అన్నారం డివిజన్ లో జూన్ 28, ఆదివారం మధ్యాహ్నం 3:00 గంటలకు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ముఖ్య అతిథిగా పాల్గొననున్న బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనం విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం సరూర్‌నగర్‌లోని భవాని శంకర్ ఆలయం వద్ద గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బూత్ గెలుపే బీజేపీ విజయానికి పునాది అని పేర్కొన్నారు. ప్రతి బూత్‌లో కమలం వికసించాలన్న లక్ష్యంతో ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. బూత్ బలోపేతమే పార్టీ విజయానికి బలమైన పునాది అని, బూత్ అధ్యక్షులు పార్టీకి వెన్నెముకలుగా పనిచేస్తూ ప్రతి కార్యకర్తను సమన్వయం చేసుకుని విజయానికి బాటలు వేయాలని అన్నారు. రేపు జరగనున్న విజయ సంకల్ప సమ్మేళనానికి జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ కి ఘన స్వాగతం పలుకుతూ, ఈ కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయంగా నిలిపేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చిలుకూరి రామ్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు మురళి, శ్రీధర్ రెడ్డి, ఒట్టే రాజు, మధుసూదన్ రెడ్డి, బాబు చౌదరి, సందీప్, సతీష్, వివేక్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# పునర్జన్మనిచ్చిన ఇందిరమ్మను మరవద్దు

**-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**






**దేవరకొండ జూన్ 27( మహాప్రభ )**
వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన "ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర" సభలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని ప్రసంగించారు. "గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి 50 సంవత్సరాలు" పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ బస్సు యాత్ర కాంగ్రెస్ పార్టీ గిరిజనుల పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనమని ఆయన అన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, "జన్మనిచ్చిన అమ్మను మరవద్దు -- పునర్జన్మనిచ్చిన ఇందిరమ్మను మరవద్దు" అని పేర్కొన్నారు. గిరిజనులు, ఎరుకలు, యానాదులు వంటి వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం చేయాలనే లక్ష్యంతో అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకొని ఎస్టీ రిజర్వేషన్లు కల్పించిందని గుర్తు చేశారు. గిరిజనులకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో అవకాశాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగు నింపిన పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఆయన అన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడం, గిరిజన గురుకులాల ఏర్పాటు, విద్యా సౌకర్యాల విస్తరణ, రోడ్లు, తాగునీరు, ఉపాధి అవకాశాల కల్పన వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే అమలయ్యాయని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తోందని పేర్కొన్నారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడటం, వారి హక్కులను పరిరక్షించడం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని ఆయన స్పష్టం చేశారు. గిరిజన సమాజం కాంగ్రెస్ పార్టీపై విశ్వాసాన్ని కొనసాగించాలని, అభివృద్ధి మరియు సామాజిక న్యాయం కోసం అందరూ కలిసి ముందుకు రావాలని ఎమ్మెల్యే బాలు నాయక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గిరిజన సోదరులు పాల్గొన్నారు.

# సరూర్ నగర్ చెరువు సుందరీకరణ పనులను పరిశీలించిన బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి.



**ఎల్ బి నగర్ - 27 జూన్ (మహాప్రభ)**
గడ్డి అన్నారం డివిజన్ సరూర్ నగర్ పరిధిలో చెరువు సుందరీకరణ లో నాణ్యత తో పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి అధికారులకు ఆదేశం ఇవ్వడం జరిగింది, మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి సరూర్ నగర్ చెరువు బలోపేతం, సుందరీకరణ పనులను బీజేపీ రాష్ట్ర నాయకులు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ఈరోజు ఉదయం పార్టీ నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు పరిసరాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించిన బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే విధంగా నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి అభివృద్ధి పని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని కోరారు. సరూర్ నగర్ చెరువు నగరంలోని ప్రధాన పర్యావరణ సంపదగా నిలుస్తోందని పేర్కొన్న ఆయన, చెరువు సుందరీకరణతో స్థానిక ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడటంతో పాటు వాకింగ్, వ్యాయామం, వినోదానికి అనుకూలమైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రాంత అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారంలో భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చిలుకూరి రామ్ రెడ్డి, గడ్డిఅన్నారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు దాసరి జయప్రకాష్, బీజేపీ సీనియర్ నాయకులు మురళి, శ్రీధర్ రెడ్డి, ఒట్టే రాజు, మధుసూదన్ రెడ్డి, బాబు చౌదరి, సందీప్, సతీష్, వివేక్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేసుల దర్యాప్తులో నాణ్యతకు పెద్దపీట వేయాలి

**- పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**-- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**



**పాపన్నపేట, జూన్27( మహా ప్రభ )**
కేసుల దర్యాప్తులో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అన్నారు. శనివారం వార్షిక తనిఖీలలో భాగంగా పాపన్నపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ నిర్వహణ, రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. పెండింగ్, మిస్సింగ్ కేసులను ప్రత్యేక దృష్టితో త్వరగా పరిష్కరించాలని, ఆస్తి సంబంధిత నేరాల నివారణకు బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని ఆదేశించారు. అలాగే సీసీటీఎన్ఎస్-2.0, టీఎస్-కాప్, ఈ-సాక్ష్య, సైబర్ క్రైమ్ పోర్టల్ వంటి సాంకేతిక వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. ఈ తనిఖీలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గంగాయిపల్లి అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై దాడి

**-ఐదుగురు అరెస్టు.. రూ.11,230 నగదు, ఐదు ఫోన్లు స్వాధీనం.**

**-మెదక్ జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్.**



**మెదక్ జిల్లా - 27జూన్ (మహాప్రభ )**
శివ్వంపేట మండలం గంగాయిపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని మెదక్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం దాడి నిర్వహించిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిలో ఇటిక్యాల రేవంత్ రెడ్డి, బానోత్ కంద్యా, నల్ల పేరమాన్లు, జిట్ట సత్యనారాయణ, ఎ. ప్రశాంత్ ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.11,230 నగదుతో పాటు ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మాట్లాడుతూ, జిల్లాలో జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగుతోందని తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో జరిగే అక్రమ కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

# 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలి



**తూప్రాన్,జూన్ 27 (మహా ప్రభ)**
మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ లోని నాలుగో వార్డ్ లో ఎస్ ఐ ఆర్ ప్రోగ్రాంలో పాల్గొన్న మున్సిపల్ కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్, బి ఎల్ ఓ పద్మ, జైపాల్ నాయక్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని కొత్తగా ఓటరుగా నమోదు చేయడం.మార్పులు-చేర్పులు ఓటరు జాబితాలో పేర్ల తప్పులు సరిదిద్దడం, మరణించిన వారి లేదా వేరే ప్రాంతానికి వెళ్లిన వారి పేర్లను తొలగించడం బూత్ లెవల్ అధికారులు (దీూాలు) ఇంటింటికీ తిరిగి కొత్త దరఖాస్తులు స్వీకరిస్తారు ప్రజలు సహకరించాలని నాలుగో వార్డ్ ప్రజలకు కోరారు

## తూర్పుపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో డిల్లీ రమేష్



**దేవరకొండ జూన్ 27( మహా ప్రభ)**
దేవరకొండ మండలం తూర్పుపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డిల్లీ రమేష్ తో పాటు తూర్పుపల్లి గ్రామానికి చెందిన కుంభం రవితేజ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు పెద్దలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు నిర్మల్ రావు, కుంభం వెంకట్ గౌడ్,అడ్వకేట్ నూనె సురేష్, రమేష్ ,శంకర్, మురళీధర్ రావు మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధిని కాంక్షిస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం ఈ విధమైన సేవా కార్యక్రమాన్ని చేపట్టిన దాతలను అభినందించారు. ఇటువంటి విద్యాదాన కార్యక్రమాలు గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తిని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పుస్తకాలు అందుకున్న విద్యార్థులు ఎంతో ఆనందం వ్యక్తం చేయగా, పాఠశాల సిబ్బంది మరియు గ్రామ ప్రజలు కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

# పల్స్ పోలియోకు సర్వం సిద్ధం

**- కలెక్టర్ కె. హైమావతి**



**సిద్దిపేట,-27జూన్(మహాప్రభ ).**
జూన్ 28న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. 0--5 ఏళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులను ఆమె కోరారు.జిల్లాలో 94,321 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 568 కేంద్రాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో 32 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేశారు. వలస కార్మికులు నివసించే ప్రాంతాల్లో ప్రత్యేక మొబైల్ బృందాలు తిరిగి సేవలు అందిస్తాయి. జూన్ 29, 30 తేదీల్లో కేంద్రాలకు రాని పిల్లలకు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే పోలియో చుక్కలు వేసినా మరోసారి వేయడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, అన్ని శాఖల అధికారులు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా హిందూ సామ్రాజ్య దివస్



**కరీంనగర్, -27జూన్(మహాప్రభ )**
: శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో హిందూ సామ్రాజ్య దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్త ఎలగందుల సత్యనారాయణ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ స్థాపించిన హిందూ సామ్రాజ్యం భారతీయ సంస్కృతి, ధర్మం, స్వాభిమానానికి ప్రతీక అని అన్నారు. శివాజీ మహారాజ్ దేశభక్తి, ధైర్యసాహసాలు, నాయకత్వ లక్షణాలు నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, సేవాభావం అలవర్చుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో ఇంజినీర్ కోల అన్నారెడ్డి, ప్రధానాచార్యులు మోర రణధీర్, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, గట్టు శ్రీనివాస్, కొత్తూరి ముకుందం, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు, నడిపెల్లి దీన్ దయాల్, అప్పిడి వకుల దేవి, విద్యార్థులు పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో, స్ఫూర్తిదాయక సందేశాలతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# షాబాద్ గిరిజన తాండాలో ఘనంగా ముగిసిన సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు.



**మెదక్ జిల్లా -27జూన్(మహాప్రభ ).**
మెదక్ జిల్లా,టేక్మాల్ మండల పరిధిలోని షాబాద్ గిరిజన తాండాలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈసందర్భంగా ఉదయాన్నే ఆలయ ప్రాంగణంలో మహారాష్ట్ర పూజారి శేఖర్ మహారాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నూతనంగా నిర్మించిన ఆలయంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహాలను ప్రతిష్టించారు. ఉదయం వేద బ్రాహ్మణ పండితులచే ఆలయం వద్ద హోమం పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదివాస్ మంత్ర హోమం,కనక దివాస్ హోమం,మండప దేవత హోమం తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు తిలకించడానికి మండల పరిధిలోని ఆయా తండాలకు చెందిన గిరిజన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి సేవాలాల్ ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లూనావత్ ప్రభు,ఉప సర్పంచ్,బానావత్ దర్యా నాయక్, విద్యుత్ శాఖ జూనియర్ లైన్మెన్ రమావత్ శంకర్ నాయక్, గ్రామ పాలకవర్గం సభ్యులు, ఆయా తండాల పెద్దలు,వసురామ్ నాయక్,రమేష్,లునావత్ శంకర్,తుకారం,కిషన్ నాయక్,గ్రామ పంచాయతీ ఎలక్ట్రీషియన్ పరశురామ్ నాయక్,ఆయా తండాల యువతీ, యువకులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులకు గత మూడు రోజులుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# ఎల్.ఎం.డిని నీటితో నింపాలని గంగుల కమలాకర్ డిమాండ్



**కరీంనగర్ రూరల్, -27జూన్(మహాప్రభ ).**
: కరువు సమయంలో ప్రజలకు ఆదుకునేది కాళేశ్వరం ప్రాజెక్టే అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శనివారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్.ఎం.డి జలాశయంలో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎల్.ఎం.డి నీటి నిల్వలు డెడ్ స్టోరేజ్ స్థాయికి పడిపోయాయని, కరీంనగర్ ప్రజలకు త్రాగునీరు, రైతులకు సాగునీరు అందడం లేదని విమర్శించారు. మేడిగడ్డ వద్ద మరమ్మత్తులు చేయకపోవడం వల్ల ప్రతిరోజు వేల క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తోందని, ఆ నీటిని నిల్వ చేసి కన్నెపల్లి, సుందిళ్ల, అన్నారం, ఎల్లంపల్లి ద్వారా మిడ్ మానేరు, ఎల్.ఎం.డి లను నింపాలని సూచించారు. ప్రస్తుతం ఎల్.ఎం.డి లో ఐదున్నర టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయని, అందులో మూడు టీఎంసీలు డెడ్ స్టోరేజ్ కావడంతో త్రాగునీరు సరఫరా చేయడం సాధ్యం కాదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో ప్రజలకు రెండు మూడు రోజులకు ఒకసారి మాత్రమే నీరు అందిస్తున్నదని ఆరోపించారు. ప్రజలకు నీరు అందించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాలలకు స్నేహపూర్వక న్యాయ సేవలపై అవగాహన సదస్సు




**కరీంనగర్, -27జూన్(మహాప్రభ ).**
జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మంకమ్మతోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు, ప్యానెల్ న్యాయవాదులు బాలల హక్కులు, భద్రత, ఉచిత న్యాయ సేవలు, బాల్య వివాహాల నివారణ, యాసిడ్ దాడుల బాధితులకు చట్టపరమైన రక్షణ, పోక్సో చట్టం 2012 నిబంధనలపై వివరించారు. ప్రమాదంలో ఉన్న పిల్లలకు ఉచిత న్యాయ సహాయం, కౌన్సెలింగ్, రక్షణ, పునరావాసం అందించడంలో లీగల్ సర్వీసెస్ యూనిట్ ఫర్ చిల్డ్రన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సలహాలు, మధ్యవర్తిత్వం, లోక్ అదాలత్ సేవలు అందుబాటులో ఉన్నాయని, పిల్లలపై వేధింపులు లేదా హింస జరిగితే వెంటనే అధికారులకు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యం. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పారా లీగల్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించండి -- పుష్పలత



**సుల్తానాబాద్, - 27జూన్(మహాప్రభ**
జూన్ 28న మున్సిపాలిటీ పరిధిలో జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత ప్రజలకు పిలుపునిచ్చారు. పుట్టినప్పటి నుండి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి తల్లిదండ్రులు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని ఆమె కోరారు. రెండు చుక్కలు -- ప్రతి చిన్నారికి, ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పుష్పలత విజ్ఞప్తి చేశారు.

# బిజినెస్

## పసిడి ధరల్లో మళ్ళీ 'మెరుపు'.. ఒక్కరోజులోనే భారీగా పెరిగిన రేట్లు!

**హైదరాబాద్:**
గత కొన్ని రోజులుగా తగ్గుముఖం పడుతూ వచ్చిన బంగారం ధరలు ఒక్కసారిగా యూటర్న్ తీసుకున్నాయి. కొనుగోలుదారులకు షాక్ ఇస్తూ, శనివారం దేశీయ విపణిలో బంగారం ధరలు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న పరిణామాలు, డాలర్ మారకపు విలువలో హెచ్చుతగ్గుల ప్రభావంతో పసిడి ధరలు మళ్లీ పుంజుకున్నాయి.నగరాల వారీగా ధరల తీరు:జూన్ 27 నాటి గణాంకాల ప్రకారం, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం 10 గ్రాములకు రూ. 1,43,950 వద్ద ట్రేడవుతోంది. అలాగే, ఆభరణాల తయారీకి వాడే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ. 1,31,950 గా నమోదైంది. దేశ రాజధాని ఢిల్లీ మరియు ముంబై వంటి నగరాల్లో కూడా ధరలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగుతున్నాయి. ధరల పెరుగుదలకు కారణాలు



**అంతర్జాతీయ ప్రభావం:** గ్లోబల్ మార్కెట్‌లో బంగారం ధరల్లో వస్తున్న మార్పులు నేరుగా దేశీయ ధరలపై ప్రభావం చూపుతున్నాయి.

**కరెన్సీ హెచ్చుతగ్గులు:** డాలర్‌తో రూపాయి మారకపు విలువలో వస్తున్న మార్పులు బంగారం దిగుమతి వ్యయాన్ని ప్రభావితం చేస్తున్నాయి.

**పెట్టుబడిదారులు**: మార్కెట్ అనిశ్చితి నేపథ్యంలో, సురక్షిత పెట్టుబడి సాధనంగా చాలామంది పసిడి వైపు మొగ్గు చూపడం కూడా ధరల పెరుగుదలకు ఒక కారణమని విశ్లేషకులు చెబుతున్నారు.

**పెట్టుబడిదారులకు సూచన:**జూన్ నెల ప్రారంభం నుండి బంగారం ధరలు సుమారు 9-10 శాతం వరకు తగ్గుదల నమోదు చేశాయి. అయితే, ప్రస్తుత పెరుగుదల తాత్కాలికమా లేక మళ్ళీ ధరలు గరిష్ట స్థాయికి చేరుకుంటాయా అనే ఆందోళన కొనుగోలుదారుల్లో కనిపిస్తోంది. దీర్ఘకాలిక పెట్టుబడిదారులు మార్కెట్ ఒడిదుడుకులను గమనిస్తూ, ధరలు తగ్గినప్పుడు దశలవారీగా (రాఖ్రా పద్ధతిలో) బంగారం కొనుగోలు చేయడం ఉత్తమమని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. బంగారం కొనే ముందు ఆయా నగరాల్లోని లేటెస్ట్ ధరలను స్థానిక జ్యువెలరీ షాపుల్లో లేదా అధికారిక వెబ్ సైట్లలో ఒకసారి సరిచూసుకోవడం మంచిది.గమనిక: పైన పేర్కొన్న ధరలు పన్నులు, తయారీ ఛార్జీలకు ముందున్నవి. ఆభరణాలు కొనేటప్పుడు వీటితో పాటు 3 శాతం జీఎస్టీ అదనం.

## ఇక కొత్త వెర్షన్‌తో బజాజ్ పల్సర్ బైక్.. అద్భుతమైన ఫీచర్స్..!



2026 బజాజ్ పల్సర్ 220ఖీ ఇటీవల ఒక కొత్త అప్‌డేట్‌ను పొందింది. ఇందులో ఎల్‌ఈడీ హెడ్‌లైట్, ఇండికేటర్లు ఉన్నాయి. ఈ అప్‌డేట్ తర్వాత దీని ధరను రూ. 1.36 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా నిర్ణయించారు. అలాగే దేశవ్యాప్తంగా ఉన్న అధీకృత డీలర్‌షిప్‌లలో బుకింగ్‌లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ బైక్‌లో ఇంతకుముందు సాంప్రదాయ హాలోజన్ లైటింగ్ సెటప్ ఉండేది. కానీ ఇప్పుడు కొత్త ఎల్‌ఈడీ యూనిట్‌తో ఇది మరింత ఆధునికంగా మారింది. ఎల్‌ఈడీ లైట్లు మెరుగైన ప్రకాశం, అధిక శక్తి సామర్థ్యం, ఎక్కువ కాలం మన్నికకు ప్రసిద్ధి చెందాయి. ఇవి రైడింగ్ అనుభవాన్ని మరింత మెరుగుపరుస్తాయి. అయినప్పటికీ, బజాజ్ ఈ బైక్ సిగ్నేచర్ సెమీ-ఫెయిర్డ్ డిజైన్, నమ్మకమైన మెకానికల్ సెటప్‌ను అలాగే ఉంచి దాని క్లాసిక్ లుక్, పనితీరు రెండింటినీ కాపాడుకుంది.

కొత్త విశేషాలు ఏమిటి?

ఈ కొత్త అప్‌డేట్‌తో 2026 బజాజ్ పల్సర్ 220ఖీ మరింత ఆకర్షణీయంగా మారింది. ఈ బైక్‌లో ఇప్పుడు ఫుల్-ఞజుణ హెడ్‌లైట్, సొగసైన ఎల్‌ఈడీ టర్న్ ఇండికేటర్లు ఉన్నాయి. ఇవి దాని రూపాన్ని మెరుగుపరచడమే కాకుండా, రాత్రిపూట కనిపించేలా చేసి భద్రతను కూడా పెంచుతాయి. అదనంగా ఈ బైక్‌లో కొత్త గ్రాఫిక్స్, అప్‌డేట్ చేసిన కలర్ స్కీమ్‌లు కూడా ఉన్నాయి. ఇవి దాని డిజైన్‌ను మునుపటి కంటే మరింత తాజాగా, స్పోర్టీగా కనిపించేలా చేస్తున్నాయి. అయితే బజాజ్ తన అసలు గుర్తింపును నిలుపుకుంది. సెమీ-ఫెయిర్డ్ డిజైన్, ప్రొజెక్టర్-స్టైల్ ఫ్రంట్, స్పోర్టీ స్టాన్స్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు.


## బీఎండబ్ల్యూ సరికొత్త కారు.. ప్రారంభ ధర రూ.1.77 కోట్లు

**న్యూఢిల్లీ,**
బీఎండబ్ల్యూ.. దేశీయ మార్కెట్లోకి సరికొత్త మాడల్‌ను పరిచయం చేసింది. ఎక్స్6 ఎం60ఐ ఎక్స్‌డ్రైవ్‌తో విడుదల చేసిన ఈ మాడల్ ధర రూ. 1,77,90,000గా నిర్ణయించింది. కేవలం 4.5 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 250 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.ఈ కారుపై మూడేండ్లు లేదా 10 వేల కిలోమీటర్ల వరకు బైబ్యాక్ ఆఫర్‌ను ఇస్తున్నట్టు కంపెనీ ప్రెసిడెంట్, సీఈవో హర్దీప్ సింగ్ బ్రార్ తెలిపారు. ఈ కారులో 6 ఎయిర్‌బ్యాగ్‌లు, యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్, డైనమిక్ స్టెబిల్టీ కంట్రోల్, ఎలక్ట్రిక్ పార్కింగ్ బ్రేక్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది.




## భళా ఐర్లాండ్.. వెస్టిండీస్‌ను చిత్తు చేసిన అమ్మాయిలు..!

మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఐర్లాండ్ సంచలనం సృష్టించింది. మాజీ ఛాంపియన్ వెస్టిండీస్ సెమీస్ అవకాశాల్ని సంక్లిష్టంగా మార్చేసింది. బలమైన విండీస్‌ను128కే కట్టడి చేసిన ఐరిష్ టీమ్.. స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. ఒర్లా ప్రెండెర్గాస్ట్(63) అర్ధ శతకంతో కదం తొక్కగా.. ఓపెనర్ అమీ హంటర్(28) విలువైన ఇన్నింగ్స్ ఆడింది. వీరిద్దరూ రెండో వికెట్‌కు 62 రన్స్‌తో గెలుపు పునాది వేయగా రెబెక్కా స్టాకెల్(16 నాటౌట్), లిటిల్(నాటౌట్) లాంఛనం ముగించారు. దాంతో, నాలుగో విజయంతో సెమీస్ చేరాలనుకున్న కరీబియన్ జట్టు.. ఇంగ్లండ్, న్యూజిలాండ్ మ్యాచ్ ఫలితం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.నాలుగు పరాజయాలతో టోర్నీ నుంచి నిష్క్రమించిన ఐర్లాండ్ ఆఖరి పంచ్ విసిరింది. పోతూపోతూ సెమీస్ బెర్తుకు అడుగుదూరంలోని వెస్టిండీస్‌ను ఓడించింది. శుక్రవారం భారత్‌పై పురుషుల జట్టు చరిత్రాత్మక విజయాన్ని స్ఫూర్తిగా తీసుకున్న మహిళల జట్టు 6 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. మొదట బౌలర్ల కృషితో ప్రత్యర్థిని 128కే కట్టడి చేసిన ఐరిష్ టీమ్. స్వల్ప ఛేదనను ఐర్లాండ్ ఓపెనర్లు దూకుడుగా



ఆరంభించారు. గాబి లెవిస్(9) త్వరగానే ఔటైనా.. అమీ హంటర్(28) జతగా ఒర్లా ప్రెండెర్గాస్ట్(63) నిలబడింది.

**రెండో వికెట్‌కు 62 రన్స్**

విండీస్ స్పిన్నర్లను ధీటుగా ఎదుర్కొన్న ఈ ద్వయం స్కోర్ బోర్డును ఉరికించింది. చకచకా సింగిల్స్, డబుల్స్ తీసిన ఈ జంట విండీస్ బౌలర్లను విసిగించింది. రెండో వికెట్‌కు 62 రన్స్ జోడించిన హంటర్‌ను స్టెఫానీ టేలర్ డైవింగ్ క్యాచ్‌తో పెవిలియన్ పంపింది. అప్పటికీ ఐర్లాండ్ విజయానికి 42 బంతుల్లో 41 రన్స్ కావాలి. హంటర్ వెనుదిరిగాక దూకుడు పెంచిన ప్రెండెర్గాస్ట్ స్వీప్, కట్ షాట్లతో అలరించింది.మునిసర్ ఓవర్లో తొలి బంతికి బౌండరీతో అర్ధ శతకం పూర్తి చేసుకున్న తను.. బంతిని స్టాండ్స్‌లోకి పంపబోయి బౌండరీ వద్ద డాటిన్ చేతికి చిక్కింది. అనంతరం.. లీహ్ పౌల్(4) వెనుదిరిగినా.. రెబెక్కా స్టోకెల్(16 నాటౌట్) ఒత్తిడికి లోనవ్వకుండా ఆడి చిరస్మరణీయ విజయాన్ని అందించింది. ఐర్లాండ్ విజయంతో సెమీస్‌పై ఆశలు పెట్టుకున్న శ్రీలంక సైతం టోర్నీ నుంచి నిష్క్రమించింది.

**సమిష్టిగా రాణించగా..**

టాస్ ఓడిన వెస్టిండీస్ భారీ సోర్ కొడుతుందనుకుంటే అనూహ్యంగా 128కే పరిమితమైంది. తొలి ఓవర్ చివరి బంతికే ఓపెనర్ క్వియానా జోసెఫ్(8) ఔటవ్వగా.. క్యాంప్‌బెల్(4) రెండో వికెట్‌గా వెనుదిరిగింది. ఐరిష్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో విండీస్ హిట్టర్లు బ్యాట్ ఝులిపించలేకపోయారు. కెప్టెన్ హేలీ మాథ్యూస్(22), చినెల్లె హెన్రీ (27), డియాంద్ర డాటిన్(21) రాణించగా.. ఐరిష్ బౌలర్లలో ఐమీ మగిరీ, కార ముర్రే తలా రెండేసి వికెట్లు తీశారు.

## పాండ్యా సీక్రెట్ మ్యారేజ్?

స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా తన గర్ల్‌ఫ్రెండ్, ప్రముఖ మోడల్ మహికా శర్మను రహస్యంగా పెళ్లాడాడా? అంటే అవుననే అంటున్నాయి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న సరికొత్త ఫోటోలు. వీరిద్దరూ సీక్రెట్‌గా వివాహం చేసుకున్నారంటూ నెట్టింట పెద్ద ఎత్తున ఊహాగానాలు మొదలయ్యాయి. హార్దిక్, మహికా ఇద్దరూ ఒక వృద్ధురాలితో కలిసి దిగిన ఫోటో ఆన్‌లైన్‌లోకి రావడంతో ఈ రూమర్లు ఒక్కసారిగా ఊపందుకున్నాయి.వైరల్ అవుతున్న ఆ ఫోటోను నిశితంగా గమనించిన నెటిజన్లు ఒక ఆసక్తికరమైన విషయాన్ని కనిపెట్టారు. హార్దిక్ పాండ్యాతో కలిసి ఫోటోకు పోజులిచ్చిన మహికా శర్మ నుదుటిపై 'సింధూరం' ధరించి ఉండటం అందరి దృష్టిని ఆకర్షించింది. అంతేకాకుండా, ఆ ఫోటోలో ఉన్న వృద్ధురాలు ఈ జంట చేతులను పట్టుకుని ఆశీర్వదిస్తున్నట్లుగా ఉంది. దీంతో, వీరిద్దరూ అత్యంత సన్నిహితుల మధ్య ఒక ప్రైవేట్ వేడుకలో పెళ్లి బంధంతో ఒకటయ్యారని, ఆ తర్వాతే ఈ ఫోటో దిగారని సోషల్ మీడియాలో చాలా మంది బలంగా నమ్ముతున్నారు. ఈ పెళ్లి వార్తలపై హార్దిక్ లేదా మహికా నుండి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక



ప్రకటన రాలేదు. అయినప్పటికీ, వీరిద్దరి ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ అవుతున్నాయి. కొంతకాలంగా డేటింగ్‌లో ఉన్న ఈ జంట, ఇప్పుడు తమ బంధాన్ని తదుపరి దశకు తీసుకెళ్లి జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారని అభిమానులు ఫిక్స్ అయిపోతున్నారు.తన మాజీ భార్య నటాషా స్టాన్‌కోవిచ్‌తో విడిపోయిన రెండేళ్ల తర్వాత.. హార్దిక్ పాండ్యా తన జీవితంలోకి వచ్చిన కొత్త మహిళగా మోడల్ మహికా శర్మను ప్రపంచానికి పరిచయం చేశాడు.గతేడాది (2025) అక్టోబర్ 10న, హార్దిక్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో మహికాతో కలిసి బీచ్‌లో దిగిన ఒక ఫోటోను షేర్ చేశాడు. ఆ ఫోటోలో వీరిద్దరూ సముద్రతీరంలో ఎంతో ప్రశాంతంగా, సంతోషంగా కనిపించారు. హార్దిక్ ఓవర్‌సైజ్డ్ జాకెట్, షార్ట్స్ ధరించి మహికా భుజంపై చేయి వేయగా.. తెల్లటి షర్ట్ డ్రెస్‌లో ఉన్న మహికా కెమెరాకు దూరంగా చూస్తూ ఉంది. ఈ ఫోటోకు మహికా ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌ను ట్యాగ్ చేయడం ద్వారా హార్దిక్ తమ బంధాన్ని అధికారికంగా ప్రకటించాడు. అప్పట్లోనే ఈ జంట కెమిస్ట్రీ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.హార్దిక్ పాండ్యా కంటే ఏడేళ్లు చిన్నదైన మహికా శర్మ.. భారత ఫ్యాషన్ రంగంలో ఎంతో గుర్తింపు తెచ్చుకున్న మోడల్. ఆమె 'టాప్ మేగజైన్‌ల కవర్ పేజీలపై మెరిసింది. అంతేకాకుండా, ప్రతిష్టాత్మక 'ఇండియన్ ఫ్యాషన్ అవార్డ్స్'లో 'మోడల్ ఆఫ్ ది ఇయర్' అవార్డును కూడా సొంతం చేసుకుంది. తనీష్క , వివో , యునిక్లో వంటి ప్రముఖ బ్రాండ్ల యాడ్స్‌లో నటించిన మహికా.. తరుణ్ తహిలియాని, మనీష్ మల్హోత్రా, అనితా డోంగ్రే వంటి టాప్ డిజైనర్లు రూపొందించిన దుస్తులలో ఫ్యాషన్ షోలలో తరచూ సందడి చేస్తుంటుంది. మరి ఈ పెళ్లి రూమర్లపై హార్దిక్ పాండ్యా ఎలా స్పందిస్తాడో చూడాలి!

# స్పోర్ట్స్

## టీమిండియా ఖాతాలో 5 అవమానకర రికార్డులు

ర్లాండ్‌తో బెల్ఫాస్ట్‌లోని సివిల్ సర్వీస్ క్రికెట్ క్లబ్ మైదానంలో జరిగిన మొదటి టీ20 మ్యాచ్‌లో భారత క్రికెట్ జట్టుకు పెద్ద అవమానం ఎదురైంది. 183 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన



టీమిండియా కేవలం 148 పరుగులకే కుప్పకూలిపోయి 34 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. అయితే ఈ మ్యాచ్‌లో భారత్ కేవలం మ్యాచ్ మాత్రమే ఓడిపోలేదు, తమ ఖాతాలో ఎవరూ కోరుకోని ఐదు అత్యంత అవమానకర రికార్డులను కూడా లిఖించుకుంది. భారత క్రికెట్ చరిత్రలో ఐర్లాండ్ చేతిలో టీమిండియా ఓడిపోవడం ఇదే తొలిసారి. 2007వ సంవత్సరంలో ఈ రెండు దేశాల మధ్య మొదటి అంతర్జాతీయ మ్యాచ్ జరిగింది. అప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన 11 మ్యాచ్‌ల్లోనూ భారత్ అజేయంగా నిలిచింది. కానీ తాజా మ్యాచ్‌లో ఐర్లాండ్ అద్భుత ప్రదర్శనతో భారత్‌పై తొలి విజయాన్ని నమోదు చేసి చరిత్ర సృష్టించింది. దీనితో అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్‌ను ఓడించిన 11వ జట్టుగా ఐర్లాండ్ నిలిచింది.టీమిండియా వరుసగా రెండోసారి టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత ఆడిన తన మొదటి మ్యాచ్‌లోనే ఘోరంగా ఓడిపోయింది. గతంలో 2024లో టీ20 ప్రపంచ కప్ ఛాంపియన్‌గా నిలిచిన వెంటనే జింబాబ్వే పర్యటనకు వెళ్లిన భారత్, అక్కడ జరిగిన మొదటి మ్యాచ్‌లోనే ఓడిపోయింది. ఇప్పుడు 2026లో కూడా సరిగ్గా అదే సీన్ రివర్స్ అయింది. వరల్డ్ కప్ గెలిచిన ఆనందంలో ఉన్న భారత్‌కు మొదటి మ్యాచ్‌లోనే పరాజయం ఎదురైంది. భారత ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ ఈ మ్యాచ్‌లో దారుణంగా విఫలమయ్యాడు. ఆయన తన 4 ఓవర్ల కోటాలో ఏకంగా 57 పరుగులు సమర్పించుకున్నాడు. అంతకుముందు ఆడిన తన మునుపటి టీ20 మ్యాచ్‌లో కూడా ఆయన 68 పరుగులు ఇచ్చాడు. దీనితో వరుసగా రెండు అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌ల్లో కలిపి ఏకంగా 125 పరుగులు సమర్పించుకున్న మొదటి భారతీయ బౌలర్‌గా ప్రసిద్ధ్ కృష్ణ ఒక అపకీర్తిని తన ఖాతాలో వేసుకున్నాడు.ఈ మ్యాచ్‌లో ప్రసిద్ధ్ కృష్ణ వేసిన బౌలింగ్ స్పెల్ ఆయనకు ఒక పీడకలలా మిగిలిపోనుంది. మ్యాచ్ 17వ ఓవర్ వేసిన ఆయన బౌలింగ్‌లో ఐర్లాండ్ బ్యాటర్లు ఉతికేసారు. ముఖ్యంగా గారెత్ డెలానీ వరుసగా మూడు సిక్సర్లు బాదడంతో ఆ ఒక్క ఓవర్లోనే ఐర్లాండ్ జట్టు ఏకంగా 27 పరుగులు రాబట్టింది. దీనితో ఐర్లాండ్‌తో జరిగిన టీ20 క్రికెట్ చరిత్రలోనే అత్యంత ఎక్కువ పరుగులు ఇచ్చిన భారత బౌలర్‌గా ప్రసిద్ధ్ రికార్డు సృష్టించాడు.భారత పూర్తి స్థాయి టీ20 కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌కు ఇది మొదటి మ్యాచ్. కానీ దురదృష్టవశాత్తు కెప్టెన్‌గా తన తొలి మ్యాచ్‌లోనే ఆయనకు ఓటమి ఎదురైంది. దీనితో అంతర్జాతీయ టీ20ల్లో కెప్టెన్‌గా చేసిన మొదటి మ్యాచ్‌లోనే ఓడిపోయిన నాలుగో భారతీయ కెప్టెన్‌గా అయ్యర్ నిలిచాడు. అంతకుముందు విరాట్ కోహ్లీ, రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్ కూడా కెప్టెన్‌గా తమ మొదటి టీ20 మ్యాచ్‌ల్లో ఓటమిని చవిచూశారు.

# ఇరుముడి కట్టు పాట 29న విడుదల




మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ డ్రామా 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్, టి-సిరీస్ సంయుక్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్‌ను చిత్ర బృందం ప్రకటించింది. ఈ సినిమా నుంచి మొదటి పాట 'ఇరుముడి కట్టు' పాటను జూన్ 29వ తేదీన ఉదయం 11:07 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని ఈ ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, సాయి కుమార్, బేబీ నక్షత్ర, విష్ణుశర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాలో రవితేజ సరికొత్త డివోషనల్ లుక్‌లో కనిపించనున్నారు. ఒక తండ్రి, కూతురి మధ్య ఉండే ఎమోషనల్ బాండింగ్, అయ్యప్ప స్వామి మాల ధారణ ద్వారా ఒక వ్యక్తి జీవితంలో వచ్చే ఆధ్యాత్మిక మార్పుల చుట్టూ ఈ కథ తిరగనుంది. రవితేజ కెరీర్‌లోనే ఇదొక విభిన్నమైన చిత్రంగా నిలవబోతోంది.



గోల్డెన్ కలర్ డ్రెస్సులో టాలీవుడ్ 'రాధిక' నేహా శెట్టి మెరిసిపోతోంది. తన హాట్ హాట్ అందాలను ఆరబోస్తూ ఆమె చేసిన లేటెస్ట్ ఫోటోషూట్ నెట్టింట సెగలు రేపుతోంది. గ్లామరస్ లుక్స్‌తో పాటు కిల్లింగ్ పోజులతో కుర్రకారుకు పిచ్చెక్కిస్తున్న ఈ బ్యూటీ అందాల విందు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

## నెటెడ్ డ్రెస్సులో నేహా శెట్టి గ్లామర్ అటాక్..

# ట్రోలింగ్ భయంతో.. నోరు విప్పలేకపోతున్నా..

ట్రోలింగ్..! సోషల్ మీడియా ఓపెన్ చేస్తే చాలు.. కనిపించేది ఇదే! అయితే ఇక్కడ సాడ్ రియాల్టీ ఏంటంటే... చాలా మంది నెటిజన్లు దీన్ని ఎంటర్‌టైన్మెంట్‌గానే చూస్తున్నారు. ఓ సెలబ్రిటీ పై జరిగే ట్రోలింగ్ కూడా ఎంజాయ్ చేస్తున్నారు. షేర్ చేస్తున్నారు. అదే ట్రోలింగ్ కు గురైన సెలబ్రిటీ మాత్రం.. తెలియని భయంలోకి జారుకుంటున్నారు. ఇప్పుడు రష్మిక మందన కూడా... ట్రోలింగ్ భయానికి గురయ్యారు. ఇదే విషయాన్ని తనే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. ఎట్ ప్రజెంట్ బాలీవుడ్ కాక్ టెయిల్ 2 సినిమా చేసిన రష్మిక మందన.. ఆ సినిమాకు వస్తున్న రెస్పాన్స్‌తో హ్యాపీగా ఉంది. ఈక్రమంలోనే తన సినిమాకు మరింత ప్రచారం కల్పించేందుకు ఓ ఇంటర్వ్యూకు వెళ్లింది. అక్కడ ట్రోలింగ్ భయంతో తాను ఏం మాట్లాడలేకపోతున్నా అంటూ ఎమోషనల్ అయింది. ఎప్పుడు ఏం మాట్లాడాలన్నా భయం వేస్తుంది..మనం ఏం మాట్లాడినా.. అది వేరే విధంగా వెళ్తుంది. తాను అనని విషయాలను కూడా అన్నట్టు ప్రచారం చేస్తున్నారు. మన గురించి ఎలాంటి రూమర్ వస్తుందో అని రోజూ భయంతో గడపాల్సిన పరిస్థితి వచ్చింది. సోషల్ మీడియా మంచిదే కానీ దాన్ని కొందరు తప్పుగా వాడుతున్నారు అని అంటూ రష్మిక మందన ఎమోషనల్‌గా చెప్పుకొచ్చింది. ఇప్పుడు ఈమె మాటలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ట్రోలింగ్ సెలబ్రిటీలను ఎలా బాధిస్తుందనేది అందరికీ తెలిసేలా చేస్తో



# ఇడుపు కాయితం సినిమా టైటిల్‌పై రచ్చ

## టైటిల్ మార్చేది లేదన్న దర్శకుడు బన్నీవాసు




ఒక సినిమా విడుదలైన తర్వాత అందులోని పాత్రలు, సన్నివేశాలు, సంభాషణలపై చర్చ.. వివాదాలకు దారి తీయడం ఇప్పటివరకూ చూశాం. ఇటీవల కాలంలో టైటిల్‌తోనే చర్చకు దారితీసిన మూవీ 'ఇడుపు కాయితం'. సోషల్ మీడియాలో పనిగట్టుకుని కొందరు పెట్టిన పోస్టులు వివాదానికి దారితీశాయి. సినిమా భాష, యాస, టైటిల్స్ విషయంలో రెండు వర్గాలుగా విడిపోయి.. ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలకు దిగారు. ఈ క్రమంలో చిత్ర నిర్మాత బన్ని వాస్ స్పందించారు. ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదని, కథను బట్టే టైటిల్ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం వివాదం నేపథ్యంలో టైటిల్, కథను మార్చే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఏ సినిమాకైనా కథ, దాని నేపథ్యం బట్టే టైటిల్ ఉంటుంది. దీనిపై ఇక చర్చ అనవసరం. షూటింగ్ పూర్తయి విడుదలైన తర్వాత సినిమానే మాట్లాడుతుంది. ఆంధ్రా, తెలంగాణ ఎవరైనా సరే సినిమా నచ్చితేనే చూస్తారు. నచ్చకపోతే చూడరు. నేను చేయాల్సింది సినిమాను బాగా తీయడంపై దృష్టి పెట్టడమే. ప్రస్తుతం ఈ వివాదం వల్ల సినిమాకు కొంత ఇబ్బంది కలిగిన మాట వాస్తవం. రేపు సినిమా బాగుంటే అన్నీ సర్దుకుంటాయి. ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదు. నాకు పూర్తి నమ్మకం ఉంది. దర్శకుడు వచ్చిన ప్రాంతం, చూసిన వాస్తవ సంఘటనల నుంచి రాసుకున్న కథ ఇది అన్నారు. ప్రియదర్శి, నాగదుర్గ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి వంశీరెడ్డి దొండపాటి దర్శకుడు. ఇడుపు కాయితం అంటే విడాకుల పత్రం.. భార్యాభర్తలు విడిపోవడానికి పెద్దల సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పంద పత్రం. ఇప్పుడు దంపతులు విడిపోవాలనుకుంటే కోర్టులు చుట్టూ తిరుగుతున్నారు. కానీ, కొద్ది కాలం కిందట కలిసి బతకలేమని నిర్ణయించుకున్న దంపతులు పెద్ద మనుషుల సమక్షంలో విడిపోవడానికి ఒక ఒప్పందం చేసుకునే వారు. దీన్నే ఇడుపు కాయితం అని పిలిచేవారు. ఇప్పటికీ తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇడుపు కాయితం రాసుకొని విడిపోతున్న జంటలున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తున్న పదాల్లో 'ఇడుపు కాయితం' ఒకటి. ప్రియదర్శి హీరోగా తెరకెక్కుతున్న కొత్త సినిమా టైటిల్‌గా ఈ పదాన్ని ప్రకటించిన తర్వాత దీనిపై పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. కొందరు ఈ పదానికి అర్థం ఏమిటని వెతుకుతుండగా, మరికొందరు దీనిపై సోషల్ మీడియాలో చర్చలు, వాదోపవాదాలు మొదలుపెట్టారు. దీంతో 'ఇడుపు కాయితం' అనే పదం ఒక్కసారిగా ట్రెండింగ్‌లోకి వచ్చింది.



# మైత్రీ మూవీ మేకర్స్‌లో నవీన్ పోలిశెట్టి

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో నవీన్ పోలిశెట్టి తన తదుపరి క్రేజీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నాడు. 'అనగనగా ఒక రాజు' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, వంద కోట్ల క్లబ్‌లో చేరి తన మార్కెట్ స్టామినాను నిరూపించుకున్న నవీన్.. తన కొత్త సినిమాను లైన్‌లోపెట్టాడు. అగ్ర నిర్మాణ సంస్థ అయిన మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించబోతుంది. నవీన్ పోలిశెట్టి మార్కెట్ పరిధిని దృష్టిలో ఉంచుకుని ఈ కలయికపై మైత్రీ సంస్థ చాలా నమ్మకంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రాకముందే నవీన్ పోలిశెట్టి సోషల్ మీడియా వేదికగా చేసిన ఒక వినూత్న ప్రమోషన్ ప్రస్తుతం నెట్టింట సంచలనంగా మారింది. సినీ ఇండస్ట్రీలోని నలుగురు టాప్ కమర్షియల్ డైరెక్టర్స్ ప్రశాంత్ నీల్, సుకుమార్, లోకేష్ కనగరాజ్, మరియు రిషబ్ శెట్టిలతో కలిసి దిగిన ఒక అదిరిపోయే ఫన్నీ రీల్‌ను ఆయన షేర్ చేశాడు. ఈ దర్శకుల సినిమాల బాక్సాఫీస్ వసూళ్లను ఉద్దేశిస్తూ.. దీనిని తన కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన 'రూ. 5000 కోట్ల ఫ్రేమ్' అని నవీన్ చమత్కరించాడు. ఈ వైరల్ వీడియో ద్వారా మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో తన తదుపరి చిత్రం రాబోతోందని నవీన్ క్లారిటీ ఇచ్చాడు. దీనికి స్పందనగా మైత్రీ మూవీ మేకర్స్ కూడా నవీన్‌ను తమ ప్రొడక్షన్ ఫ్యామిలీలోకి ఆహ్వానిస్తూ.. ఒక ఫుల్-ఆన్ ఎంటర్‌టైనర్ లోడింగ్ అవుతోందని వెల్లడించింది. అయితే ఈ సరికొత్త ప్రాజెక్ట్‌ను పూర్తి స్థాయి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించ నున్నారు. 'సైరన్' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న తమిళ దర్శకుడు ఆంటోనీ భాగ్యరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు సినీ వర్గాల్లో గట్టి ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం స్క్రిప్టింగ్, ప్రీ-ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసిన చిత్ర బృందం, త్వరలోనే షూటింగ్‌ను ప్రారంభించి, వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ప్లాన్ చేస్తోంది. నవీన్ పోలిశెట్టి అద్భుతమైన కామిక్ టైమింగ్, ఆంటోనీ భాగ్యరాజ్ టేకింగ్, మరియు మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువల కలయికలో రాబోతున్న ఈ చిత్రంపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com